PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 11.05.2012, శుక్రవారం
సంపుటి : 31 సంచిక : 49
పేజీలు : 16, వెల : ₹ 4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ప్రత్యేక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్

రవి చిన్నపిల్లల ఆసుపత్రి
RICH HOSPITALS
పొగతోట, నెల్లూరు. A.P. ఫోన్: 2328562, 2326228 (ఎమర్జెన్సీ)

> తెల్లరేషను కార్డు కలిగినవారికి 'ఆరోగ్యశ్రీ' పథకం క్రింద సూచించబడిన అన్ని రకముల చిన్నపిల్లల వ్యాధులకు పూర్తి ఉచితంగా కార్పొరేట్ వైద్య సౌకర్యం అందించబడుతున్న చిన్నపిల్లల ఆసుపత్రి.

నియోనాటల్ జాండీస్ కేర్ యూనిట్(NJCU)



కామెర్ల వ్యాధికి గురైన పుటిటి శిశువులకై ప్రత్యేక చికిత్స విభాగము. ఫోటోథెరపి నుండి, రక్తమార్పిడి (Blood Exchange Transfusion) వరకు నిరంతరంగా అందించే అత్యాధునిక వైద్య విభాగము.

డా॥ టి.రవికుమార్, M.D. (Paed.), D.C.H.
డైరెక్టర్ & చీఫ్ కన్సల్టెంట్, రిచ్ హాస్పిటల్స్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వముచే రెఫరల్ హాస్పిటల్‌గా గుర్తింపు పొందిన వైద్య సంస్థ

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# సాక్షికి సంకెళ్లు



## • పత్రికాస్వేచ్ఛపై చట్టం వేటుకు ప్రతిఘటన • రాష్ట్రవ్యాప్తంగా పెల్లుబికిన నిరసన

"సాక్షి"కి సంకెళ్లు..."! అవును నిజమే, జగన్ అక్రమాస్తుల పేరుతో సిబిఐ పన్నిన పాచికా...? లేక రాజకీయంగా 'జగన్' పార్టీని అతఃపాతాళానికి త్రొక్కే లక్ష్యంతో "అతిష్ఠానం" వేసిన పన్నాగమా..?? ఇవి అందరినీ వేధిస్తున్న ప్రశ్నలు.

వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలో తాను మంచి చేసినా దానిని ప్రత్యేకంగా పనికట్టుకొని వక్రీకరిస్తున్న ఆ రెండు పత్రికల పోకడలతో విసిగిపోయి, కాంగ్రెస్ పార్టీ వాయిస్‌గా మీడియా రంగంలోకి అడుగుపెట్టాలనే నిర్ణయానికి వచ్చిన తర్వాత ఆవిర్భవించినవే "సాక్షి" దినపత్రిక, "సాక్షి"టీవీ.

ఆనాడు ప్రత్యేకంగా 'ఈనాడు' పత్రికను టార్గెట్‌గా చేసుకొని సవాళ్లమీద సవాళ్లు విసిరి, మార్గదర్శిని కట్టడిచేసిన కాంగ్రెస్ పార్లమెంటుసభ్యుడు ఉండవల్లి అరుణకుమార్ నేడు ఆనాటి వ్యక్తికృతజ్ఞతను వైయస్ కుటుంబం పట్ల చూపటంలేదెందుకనో...?

రాష్ట్రంలో కాంగ్రెస్ పతాకాన్ని రెపరెపలాడించిన వైయస్ అంటే ఒకనాడు కేంద్రంలో అత్యంత ఆదరణ ఉండేది. ఆయన ఏమి కోరితే అదే జరిగేది. విలక్షణరీతిలో ఒకనాడు శ్రీమతి సోనియాగాంధీ వైయస్‌తో మాట్లాడుతూ రామోజీని గురించి "ఓ దట్ మీడియా టైకూన్" అనటం (మిగతా 10వ పేజీలో)

## 28న కోర్టుకు జగన్

ఈ నెల 28వ తేదీన కోర్టుకు హాజరు కావాలని వైయస్ఆర్ కాంగ్రెస్ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి సిబిఐ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆరోజు జగన్ కోర్టుకు హాజరుకానున్నారు. ఆ తర్వాత జరగబోయే పరిణామాలేంటి? సిబిఐ ఆయనను అక్కడే అరెస్ట్ చేస్తే తలెత్తబోయే పరిస్థితులేంటి? అరెస్ట్‌తో సహా అన్ని రకాల సవాళ్లను ఎదుర్కోదానికి జగన్ మానసికంగా ఏనాడో సిద్ధమయ్యాడు. జగన్ మీద జరిగే ప్రతి దాడి కూడా ఆయనపట్ల అభిమానాన్ని ప్రజలలో పెంచుతుంది.

## మొదలైన పోరు.. హోరు!

(వివరాలు 7వ పేజీలో)




ఎన్నికల నోటిఫికేషన్ వెలువడలేదు గాని నెల్లూరు జిల్లాలో మాత్రం ఎన్నికల సెగ ఎండలను మరపించే రీతిలో మొదలైంది. అభ్యర్థుల కసరత్తు పూర్తి కావడంతో ప్రధానపార్టీలన్నీ కూడా ఓట్ల వేటకు కోట్ల రూపాయలతో సిద్ధమయ్యాయి.

## భారత్‌కు వరం



## రెఫరల్ వైద్యం

వివరాలు 14వ పేజీలో...

## దొరకని ఇసుక నిర్మాణాలు మసక

(వివరాలు 5వ పేజీలో)

రాష్ట్రంలో ఇసుక సంక్షోభం నెలకొంది. ఇసుక సిండికేట్ల ఇష్టారాజ్యానికి నదులు తరిగిపోతుండడంతో ఆగ్రహించిన హైకోర్టు, ఇసుక తవ్వకాల మీద ఏకంగా నిషేధం విధించడంతో రాష్ట్రమంతా ఎక్కడి నిర్మాణాలు అక్కడ ఆగిపోయాయి.



## మహదానంద సంరంభం...

# టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆరంభం!

వివరాలు 11, 16 పేజీలలో...




రిమోట్‌తో టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ నెల్లూరు శాఖను ఆవిష్కరిస్తున్న అక్కినేని



దీక్షాసేథ్, మంచు లక్ష్మీప్రసన్న, శ్రద్ధాదాస్, అర్చనలను సన్మానిస్తున్న అక్కినేని, టి.సుబ్బరామిరెడ్డి

# నెల్లూరు కబుర్లు

## చంద్రబాబు ఎన్నికల టూర్




ఉపఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల పర్యటన మొదలైంది. ఈనెల 11న నెల్లూరు లోక్‌సభ పరిధిలోకొచ్చే ప్రకాశం జిల్లా కందుకూరు నుండి ఆయన ప్రచారం మొదలుపెట్టారు. 12వ తేదీ ఉదయగిరి నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తారు. మళ్లీ 15వ తేదీ నెల్లూరు నగరం, 16వ తేదీ ఆత్మకూరు, 17వ తేదీ నెల్లూరు రూరల్ నియోజకవర్గాలలో తెలుగుదేశం అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించనున్నారు.

## 'కోడ్' కూసింది... కమిటీ ఆగింది

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ నూతన కార్యవర్గ ఏర్పాటుకు ఎన్నికల కోడ్ అడ్డమొచ్చింది. ఈ నెల 15కల్లా కొత్త కార్యవర్గాన్ని నియమించాలని అధికారులు దరఖాస్తులు కోరగా, 300మంది దాకా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎన్నికల కారణంగా ఇప్పుడు కార్యవర్గ నియామకం వాయిదా పడింది. ఎన్నికల తర్వాత ఈ కమిటీ నియామకం వుండొచ్చు.

## స్వైన్‌ఫ్లూ వట్టిదే!



జిల్లాలో స్వైన్‌ఫ్లూ వ్యాధి వుందనే ప్రచారం వట్టి వదంతేనని ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాశిలామణి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో సబ్‌యూనిట్ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌యూనిట్ అధికారులు అన్ని వ్యాధులపట్ల అవగాహన కలిగివుండాలన్నారు. స్వైన్‌ఫ్లూపై భయపడాల్సిన అవసరంలేదని, అన్ని ప్రాంతాల్లోను వ్యాధులను ఎదుర్కోవడానికి తగిన ఏర్పాటు చేసామన్నారు. సినిమాహాళ్లన్నింటిలో స్లైడ్స్ ద్వారా జబ్బులపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఉదయగిరి, రాపూరు, కోట, వెంకటగిరి ప్రాంతాలలో వ్యాధులెక్కువగా వస్తున్నాయని, అర్హులైన వారికి జెఇ వ్యాక్సిన్‌లు వేయాలని అన్నారు.

## రైల్వే స్టేషన్ మేనేజర్‌గా షాజహాన్

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ మేనేజర్‌గా షాజహాన్‌ను నియమిస్తూ విజయవాడ రైల్వేడివిజన్ అధికారులు ఉత్తర్వులు జారీచేసారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆంథోని జయరాజ్‌ను కృష్ణపట్నం రైల్వేస్టేషన్‌కు బదిలీ చేసారు.

## మస్తుగా బందోబస్తు



ఉపఎన్నికల నేపథ్యంలో జిల్లా అంతటా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఉపఎన్నికల విషయమై సోమవారం నెల్లూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపఎన్నికలు జరుగుతున్న నెల్లూరు లోక్‌సభ, ఉదయగిరి అసెంబ్లీ పరిధులలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని ఆయన ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘాపెట్టండి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా అడ్డుకోండి. సిబ్బంది అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలి. రౌడీషీటర్లను బైండోవర్ చేసుకుని, ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. గత ఎన్నికలలో కేసులు వున్నవారిని బైండోవర్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు చంద్రశేఖర్, నాగేశ్వరరావు, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## నరసింహస్వామి ఆదాయం

నెల్లూరు రూరల్ నరసింహకొండలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం హుండీని సోమవారం లెక్కించారు. ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయానికి 4,71,205 రూపాయల ఆదాయం వచ్చింది. గత బ్రహ్మోత్సవాలతో పోలిస్తే ఈ ఏడాది 1,06,372రూపాయల ఆదాయం పెరిగింది.

## గిరిజన ఆసుపత్రి తనిఖీ

నెల్లూరు, సోమశేఖరపురంలోని సింహపురి వైద్య సేవాసమితి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న 10 పడకల గిరిజనుల ఆసుపత్రిని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాశిలామణి, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వై.వెంకటేశ్వర్లు తనిఖీ చేసారు. ఈ వైద్యశాల ద్వారా 7మండలాలకు చెందిన గిరిజనులు మాత్రమే వైద్యసేవలు పొందుతున్నారని, కలెక్టర్‌తో చర్చించి జిల్లాలోని అన్ని మండలాల గిరిజనులకు వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డాక్టర్ మాశిలామణి చెప్పారు. వారంలో ఒకరోజు ఈ వైద్యశాలకు చిన్నపిల్లల వైద్యుడిని పంపే ఏర్పాట్లు చేస్తామన్నారు. గిరిజనుల్లో ఎక్కువగా రక్తహీనత సమస్య వుందని, దాంతో వారికి పిల్లలు కూడా అనారోగ్యంతో పుడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి వి.నారాయణ, బాల సుబ్బారావు, గుర్రం సుధాకర్, జయరామిరెడ్డి, గురుప్రసాద్, డాక్టర్ ప్రసాదరావు, డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

## అనుమతిలేని సెల్లార్ కూల్చివేత

నెల్లూరురూరల్ కొత్తూరు పంచాయితీ పరిధిలోని ఇరుగాళమ్మ సంఘంలో పడవల రజనీకి చెందిన అపార్ట్‌మెంట్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న సెల్లార్‌ను సోమవారం పంచాయితీ అధికారులు దగ్గరుండి తొలగించారు. రజనీ జిప్లస్‌ఫోర్‌కు అనుమతి తీసుకుంది. పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టడంతో కూల్చేసారు.

### ఎన్నికల వ్యయపరిశీలకుడిగా సంజీవ్‌కుమార్

జిల్లాలో ఉపఎన్నికల వ్యయపరిశీలకునిగా ఉత్తర ప్రదేశ్ ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌కు చెందిన సంజీవ్ కుమార్ యాదవ్‌ను నియమిస్తూ ఎన్నికల కమీషన్ ఉత్తర్వులు జారీచేసింది. అలాగే నెల్లూరు వాణిజ్య పన్నుల అధికారి ప్రభాకర్‌ను నెల్లూరు లోక్‌సభ, ఉదయగిరి అసెంబ్లీకి ఎన్నికల నోడల్ అధికారిగా నియమించారు.

### శాశ్వత అధ్యక్షుడిగా శాంతిలాల్‌జైన్

నెల్లూరు బులియన్ వ్యాపారుల సంఘ శాశ్వత అధ్యక్షునిగా శాంతిలాల్‌జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈనెల 6న నెల్లూరులో బులియన్ వ్యాపారుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా నూతనకమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అలిమేలి మాధవయ్య, ఉపాధ్యక్షులుగా మట్టా ప్రసన్నాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా జె.యల్.సత్యం, సహాయకార్యదర్శిగా మణిలాల్‌జైన్, కోశాధికారులుగా శంకర్‌లాల్‌జైన్, అలిమేలి సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు.

### అమీర్‌జాన్‌కు అరుదైన పత్రం

నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు షేక్ అమీర్‌జాన్‌కు ప్రపంచ స్థాయి యూనిక్ వరల్డ్ రికార్డ్ పత్రం లభించింది. ఇటీవల ఆయన 63 చింతగింజలపై 63 మంది చరిత్రకారుల చిత్రాలను చెక్కి జాతీయ స్థాయి అవార్డులను సాధించారు. ఈ అంశంపై అమీర్‌జాన్‌కు యూనిక్ వరల్డ్ రికార్డ్ బృందం నుండి ప్రపంచ రికార్డు పత్రం అందింది. ప్రపంచరికార్డు పత్రం అందుకున్న అమీర్‌జాన్‌ను కళాకారులు అభినందించారు.

## భవన నిర్మాణ కార్మికుల ధర్నా

భవననిర్మాణ కార్మికులు సోమవారం నెల్లూరు కలెక్టరేట్ ఎదుట తమకు ఉపాధి చూపాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీపీఐ నాయకుడు రామరాజు పాల్గొని మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇసుక సరఫరాకు అనుమతినిచ్చి భవన నిర్మాణకార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఇసుక తవ్వకాలపై నిషేధం విధించడంతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో భవనాలు, వంతెనలు, ఇందిరమ్మ ఇళ్లు వంటి నిర్మాణాలు ఆగిపోయి కార్మికులు పనులు లేక పస్తులతో వుంటున్నారన్నారు. అనంతరం కలెక్టర్ బి.శ్రీధర్‌కు వాళ్లు వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి, ఏ.పి. బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.రాజేష్ కుమార్, కె.ఆంజనేయులు, ఇ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్‌కు కొత్త కేంద్రం

నెల్లూరు నగరం సమీపంలోని కనుపర్తిపాడు వద్దగల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్ సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు ఎన్నికల కమీషనర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఉదయగిరి అసెంబ్లీ, లోక్‌సభ ఓట్ల లెక్కింపుకు ఈ సెంటర్‌ను ఎంచుకున్నారు. నెల్లూరులో డికెడబ్ల్యు కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలతో పాటు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీ కూడా కౌంటింగ్ సెంటర్ కానుంది.

## నెల్లూరులో విద్యుత్ కార్మికుల సదస్సు

ఈ నెల 13వ తేదీన నెల్లూరులో ఐదురాష్ట్రాల విద్యుత్ కార్మికుల సదస్సు నిర్వహిస్తున్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగనుంది. ఆంధ్రతో పాటు తమిళనాడు, కేరళ, కర్నాటక, పాండిచ్చేరి రాష్ట్రాల నుండి 300మంది ప్రతినిధులు 20మంది జాతీయ స్థాయి నాయకులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు.

## రాయితీ పెంచిన రైల్వే అధికారులు

జూన్ 1 నుంచి 50 శాతం రాయితీతో అప్లాస్టిక్ ఎనీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్థులు రైలులో ప్రయాణించుటకు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు నెలకు రూ॥25 చెల్లించి ఈ టిక్కెట్లు తీసుకున్న వారికి రోజూ 100 కిలోమీటర్లు ప్రయాణించే వీలుండేది. మొన్న రైల్వే బడ్జెటులో ప్రకటించిన విధంగా జూన్ 1 నుంచి 50శాతం రాయితీతో ఈ టిక్కెట్‌పై రోజూ 150 కి.మీ ప్రయాణించడానికి అవకాశం వుంది. సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, ఏసీ ఛైర్‌కార్, స్లీపర్‌కోచ్‌లలో రాయితీతో వీరు ప్రయాణించవచ్చు.

## ఎఫ్‌సిఐ ఏరియా మేనేజర్‌గా సునీల్‌కుమార్

నెల్లూరుజిల్లా ఎఫ్‌సిఐ ఏరియా మేనేజర్‌గా సునీల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏరియా మేనేజర్‌గా వున్న వెంకటరామయ్య హైద్రాబాద్‌లోని ఎఫ్‌సిఐ కార్యాలయానికి ఏజిఎంగా పదోన్నతిమీద వెళ్లారు.




శ్రీరస్తు! శుభమస్తు! అవిఘ్నమస్తు!!
శ్రీకామాక్షితాయ్యై నమ:
శ్లో॥ వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే!
జగత: పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ!!

శ్రీ మల్లిఖార్జునస్వామి కామాక్షితాయి దేవస్థానము
జొన్నవాడ క్షేత్రం, బుచ్చిరెడ్డిపాలెం మండలం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా. ఫోన్. 08622 - 273595, 92470 04194

బ్రహ్మోత్సవ ఆహ్వానం తేది. 11-05-2012 శుక్రవారం నుండి తేది 21-05-2012 సోమవారం వరకు

తేది 17-05-2012 రావణసేవ
తేది 18-05-2012 వెండినందిసేవ
తేది 19-05-2012 రథోత్సవము
తేది 20-05-2012 ఉ॥ కల్యాణోత్సవము
సా॥ తెప్పోత్సవము

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీనందన నామ సంవత్సర వైశాఖ బహుళ షష్ఠి తేది 11-05-2012 శుక్రవారం నుండి తేది 21-05-2012 సోమవారం వరకు జొన్నవాడ క్షేత్రములో వెలసి భక్తులకు ఇలవేల్పు, ఆరాధ్యదైవమైన శ్రీ మల్లిఖార్జునస్వామి, కామాక్షితాయి వార్లకు నవాహ్నికముగా, శైవాగమ విధానముగా బ్రహ్మోత్సవములు అత్యంత వైభవముగా జరుగును. కావున భగవద్బంధువులెల్లరు జొన్నవాడ క్షేత్రమునకు విచ్చేసి బ్రహ్మోత్సవములను తిలకించి శ్రీవార్లను దర్శించి, తీర్థప్రసాదములు స్వీకరించి శ్రీవార్ల కృపాకటాక్షములకు పాత్రులు కాగోరుచున్నాము.

వేగూరు రవీంద్రరెడ్డి, సహాయ కమీషనర్ & కార్యనిర్వహణాధికారి

PDF Compressor Free Version






## విద్యంటే వ్యాపారమే...!

విద్యవ్యాపారమైపోయిందని మొన్న జెఎన్‌టియు స్నాతకోత్సవ వేడుకలో రాష్ట్ర గవర్నర్ నరసింహన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు. విద్య వ్యాపారంగా మారిందనే సంగతి ఈ రాష్ట్రంలో అట్టడుగు ప్రజలకు కూడా తెలుసు. ఎందుకంటే వ్యాపారంగా మారిన చదువుల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నది సన్నజీవులే కాబట్టి. ఈరోజు మన చదువులు ఎలా తగలబడ్డాయంటే రోజూ కూలీ పనులకెళ్లేవాళ్ళు సైతం తమ బిడ్డలను వేలరూపాయలు పోసి ప్రైవేట్ బళ్లలో చేర్పిస్తున్నారు గాని సర్కార్ స్కూళ్లకు పంపడంలేదు. మన ప్రభుత్వ చదువులుమీద అంత నమ్మక ముంది మరి! సున్నా మార్కులొచ్చిన వారికి కూడా సీటిచ్చేస్తారా అని గవర్నర్ కాలేజీ యాజమాన్యాలపై ఆగ్రహం ప్రదర్శించారు. ఒకప్పుడు ర్యాంకులకు, సీట్లకు ప్రతిభ కొలమానంగా వుండేది.

కొంతకాలం క్రితం ఒక జోక్ నానుడిలో వుండేది. అమెరికాలోని నాసావాళ్లు చంద్రమండలం మీదకు పంపడానికి ఆరుమంది మేధావులైన శాస్త్రవేత్తలను ఎంపికచేస్తే, భారతదేశంలో మాత్రం చంద్రమండలం మీద పరిశోధనలకు ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీ, ఒక బిసి, ఒక మైనార్టీ, ఒక మేధావి అయిన శాస్త్రవేత్తను ఎంపిక చేస్తారు... అని. కాని దీనికి ఇప్పుడు ఇంకో నలుగురుని కూడా జోడించవచ్చు. రిజర్వేషన్ల పరంగా 5మంది, ఒక శాస్త్రవేత్తతో పాటూ డబ్బులు కట్టించుకుని నలుగురు కోటీశ్వరులను కూడా ఎంపికచేస్తారు. ఇప్పుడిలాగే వుంది విద్యావ్యవస్థ. చేతిలో డబ్బులుండాలేగాని పరీక్షల్లో మార్కులతో ఏం పని? ప్రతిభతో ఏం అవసరం? అక్షరం ముక్క రానివాడు కూడా మెడికల్ కాలేజీలో సీటు తెచ్చుకోవచ్చు. ఇంజ నీరింగ్ కాలేజీలో బి.టెక్ పూర్తిచేయొచ్చు. ప్రతిభను బట్టి చదువుల పట్టాలే కాదు, ఖర్చుపెట్టే కోట్లను బట్టి డిగ్రీ పట్టాలు దొరకపుచ్చుకోవచ్చు.

చదువు వ్యాపారవస్తువైందని మనం బాధపడి లాభం లేదు. ఈరోజు మన దేశంలో విద్య, వైద్యమే పెద్ద వ్యాపారవస్తువులు. కాబట్టే కదా కార్పొరేట్ దిగ్గజాలు సైతం ఈ రంగంలోకి అడుగుపెడుతున్నాయి.

ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలలో విద్య, వైద్యం ప్రజల ప్రాథమిక హక్కుగా వుంటాయి. ఆ రెండు ప్రజలకు తప్పనిసరిగా అందుబాటులో వుండాలి. కాని మన దేశంలో మాత్రం అవి అందుబాటులో లేకపోగా సామాన్య, మధ్య తరగతి వారికి ఖరీదైన వస్తువులుగా మారాయి. చదువు చుట్టూ ఇంత వ్యాపార ధృక్పథం అల్లుకుంటున్నా ప్రభుత్వాల చర్యలు నామమాత్రంగా వుంటున్నాయి. నలుదిక్కుల పది అడుగులు కొలతలతో కమర్షియల్ కాంప్లెక్స్‌లను తలపించే రీతిలో వుండే ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్ దొరకడమే మహాభాగ్యం అనుకునే పరిస్థితి వుండగా, విశాలమైన తరగతి గదులు, ఎకరాలకొద్ది క్రీడామైదానం, ల్యాబ్‌లు వంటి వసతులుగల సర్కార్ బళ్లలో అడ్మిషన్‌ల కోసం ఎవరూ రావడం లేదు. దీనికి కారణం సర్కార్ బడుల్లో చేరితే ఎక్కడ చదువులు వెనుకబడిపోతాయోనన్న భయమే! ఈ సంస్కృతి రావడానికి కారణమైన ప్రభుత్వాలను పాలకులను తిట్టుకోవడం తప్ప చేయగలిగిందేముంది.

## జనరల్‌లోకొచ్చిన మూడేళ్లలోనే...



## నెల్లూరుకు మళ్లీ ఎన్నికల కళ

రాష్ట్ర రాజకీయాలలో నెల్లూరుజిల్లాది ప్రత్యేకస్థానమైతే అందులో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గానిది ప్రత్యేకశైలి. 2009కు ముందు దాదాపు 4 దశాబ్దాల పాటు ఎస్సీ రిజర్వుడ్‌లో ఈ నియోజకవర్గం వుండింది. దానిమూలంగా నెల్లూరు రెడ్లు, ఇతర అగ్రవర్ణాల నాయకులు బయట నియోజకవర్గాలను ఆక్రమించుకుంటుండేవాళ్లు. విశాఖ, విజయవాడ, నరసారావుపేట, ఒంగోలు, బాపట్ల... ఈ లోక్‌సభ నియోజకవర్గాలన్నింటిని నెల్లూరు నాయకులు ఏలడం తెలిసిందే! ముఖ్యంగా నెల్లూరు లోక్‌సభ ఎస్సీ రిజర్వుడ్‌లో వున్నంతకాలం ఒంగోలు లోక్‌సభలో నెల్లూరీయుల హవానే కొనసాగింది. ప్రస్తుతం కూడా నెల్లూరుకు చెందిన మాగుంట శ్రీనివాసులురెడ్డి అక్కడ ఎంపీగా వుండడం తెలిసిందే! 2009లో నియోజకవర్గాల పునర్విభజన వల్ల నెల్లూరు లోక్‌సభ జనరల్ అయ్యింది. ఈ సీటును జనరల్‌గా మార్పించడానికి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తీవ్రంగా కష్టపడ్డారు. నెల్లూరు లోక్‌సభ నుండి పోటీచేయాలనే ఉబలాటంతో ఆయన అంతగా పోరాడి సాధించారు. కాని పని ఒకరిదైతే ఫలితం మరొకరిదన్నట్లు మేకపాటి రాజమోహన్‌రెడ్డి సీటు ఎగరేసుకుపోయాడు. ఇప్పుడు ఆ మేకపాటి వల్లే జనరల్ అయిన నెల్లూరు లోక్‌సభకు రెండోసారి ఎన్నికలు వచ్చాయి.

ఈ నియోజకవర్గం రిజర్వుడ్‌లో వున్నంతకాలం అగ్రవర్ణాల నాయకుల దగ్గర గులాంగిరి చేస్తున్నవాళ్లు అభ్యర్థులుగా వస్తుండేవాళ్లు. ఇప్పుడు జనరల్ అయ్యాక డైరెక్ట్‌గా పెద్దనాయకులే బరిలోకి దిగుతున్నారు. గెలుపోటములెవరివైనా ఎన్నికలలో వున్న మజాను మాత్రం జనం ఇప్పుడు అనుభవిస్తున్నారు.

## కలంపై కక్షపోటు... పత్రికాస్వేచ్ఛకు పెద్దచేటు....!




'సాక్షి' పత్రిక, టీవీలపై సిబిఐ దాడులను నిరసిస్తూ బుధవారం రాత్రి నెల్లూరు గాంధీబొమ్మ వద్ద కాగడాల ప్రదర్శన చేస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ నేతలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనీల్‌కుమార్‌యాదవ్, ద్వారకానాథ్ తదితరులు

వంద కత్తులకు ఒక్క కలంతో సమాధానం చెప్పవచ్చు. ప్రపంచాన్ని ఏలే నియంతలను సైతం నిష్పక్షపాత వార్తలతో గద్దెలపైనుండి దించవచ్చు. ప్రజాస్వామ్యానికి ఫోర్త్‌ఎస్టేట్‌గా పిలవబడే మీడియా శక్తి అటువంటిది. ఆ శక్తి వ్యక్తులకు దఖలు పడింది కాదు. పత్రికావ్యవస్థకు అబ్బిన వరం. సమాజంలో జరుగుతున్న ప్రతి అన్యాయాన్ని కూడా ఈరోజు అన్ని ప్రభుత్వసంస్థలు కళ్లు మూసుకుని చూసీచూడనట్లు పోతుంటే వాటిని వెలుగులోకి తెచ్చి ప్రజల ముందు నిలుపుతున్నది పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియానే! కాబట్టే కలానికి సంకెళ్లు పడుతూనే వున్నాయి. అనుక్షణం పత్రికాస్వేచ్ఛపై దాడులు జరుగుతూనే వున్నాయి.

## పరిచయం అదిరింది

- మెగాలెవల్లో ఎంట్రీ ఇచ్చిన టీఎస్ఆర్



తెలుగుసినిమాలలో హీరో పరిచయం గ్రాండ్‌లెవల్లో వుంటుంది. హీరో తెరపై కనపడుతున్నాడంటే నలుగురు రౌడీలబాడీలు గాల్లో ఎగరడమో, లేక హీరో కాలు క్రిందపెట్టగానే అక్కడున్న సుమోలు భగ్గునమండి పైకి లేవడమో జరుగుతుంటుంది. జిల్లా రాజకీయాలలోకి నెల్లూరు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి టి.సుబ్బరామిరెడ్డి జిల్లా ప్రవేశం కూడా ఆ లెవల్లోనే జరిగింది.

తన గురించి అందరూ అనుకునేలా చేయడం టీఎస్సార్ స్టైల్. ఆయన ఏ కార్యక్రమం చేసినా దాదాపు నెలరోజుల పాటన్నా అది జనంనోళ్లలో హాట్‌టాపిక్‌గా వుంటుంది. ప్రస్తుతం ఇలాంటి టాపిక్కే జిల్లాలో రేగింది.

జిల్లాకు పాతోడు, జిల్లాలో జన్మించినోడే అయినప్పటికి జిల్లా రాజకీయాలకు మాత్రం కొత్తోడు టీఎస్సార్. రాజకీయ నాయకులంతా ఎన్నికలలో దిగేటప్పుడు అది చేస్తాం, ఇది చేస్తాం అంటారు. కాని టీఎస్సార్ అది ఇది చేస్తానని కాకుండా చేసి చూపించడమే తన నైజమని చాటుతూ దిగారు. నెల్లూరులో తిక్కవరపు సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆవిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. అదెంత గొప్పగా జరిగిందంటే... సాధారణంగా రాజకీయనాయకులు కార్యక్రమాలు ఏర్పాటుచేస్తే ఆ సభలకు కూలీ జనాన్ని వంద, రెండొందలు, క్వార్టర్‌బాటిల్, బిర్యాని ప్యాకెట్ ఇచ్చి బస్సుల్లోనో, లారీలలోనో తీసుకురావాలి. కాని ఆదివారం కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగిన టి.సుబ్బరామిరెడ్డి లలితకళాపరిషత్ ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి జనం అదిపనిగా పోటీపడివచ్చారు. ఈ కార్యక్రమానికి పాసులున్నాయా...? అని వాకబుచేసి వాటికోసం ఎగబడ్డారు. జిల్లా రాజకీయాలలో సుబ్బరామిరెడ్డి తొలిఅడుగే అదిరింది. ఇక ముస్ముందు ఎలావుండబోతుందో!



## కొత్త లీడర్... పాత కేడర్!

- ఉదయగిరిలో మారిన రాజకీయసమీకరణలు

*ఉదయగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎట్టకేలకు కంభం విజయరామిరెడ్డిని బరిలోకి దించారు. పాతికేళ్ల ట్రాక్‌రికార్డును పరిశీలిస్తే ఉదయగిరి నియోజకవర్గంలో మేకపాటి సోదరులను ధీటుగా ఎదుర్కోగలిగింది కంభం విజయరామిరెడ్డి ఒక్కడే! అయితే కాంగ్రెస్‌కు కంభంకు ఎంతవరకు సెట్ అవుతుంది. కాంగ్రెస్‌లో కంభం ఎంతవరకు రాణిస్తాడు? కాంగ్రెస్ నాయకుడిగా ఉదయగిరి జనం ఆయనను ఎంతవరకు ఆదరిస్తారనేది చూడాలి.*

ఎందుకంటే కంభం విజయరామిరెడ్డి పాతికేళ్లుగా తెలుగుదేశం నాయకుడిగానే ముద్ర పడిపోయాడు. 1985నుండి ఆయన పార్టీలో వుంటున్నాడు. 1989ఎన్నికల నుండి వరుసగా అన్ని ఎన్నికలలోనూ తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా పోటీచేసింది ఆయనే! మేకపాటి సోదరుల ఆర్థికబలం ముందు చాలక, వరుసగా రెండుసార్లు ఓడిపోయాడు కాని, ఆర్థికంగా వారిలో పదోవంతు వున్నా ఉదయగిరిలో వారిని మించిన నాయకుడయ్యుండే వాడు. ఆర్థికంగా వెనకబడ్డాడు కాబట్టే తెలుగుదేశంపార్టీ కూడా ఆయనను ఇక పక్కనపెట్టాలనుకుంది. ఇక తెలుగుదేశంలో తనకెప్పుడైతే సీన్ లేదనుకున్నాడో అప్పుడే కంభం జెండా మార్చేసాడు. కాంగ్రెస్‌లో చేరాడు.


పాతికేళ్లపాటు ఉదయగిరిలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పని చేసిన కంభం, ఇప్పుడు అక్కడ కాంగ్రెస్ నాయకుడయ్యాడు. ఉదయగిరి నియోజకవర్గానికి కంభం పాతోడే! కాకపోతే ఆయనకు కాంగ్రెస్ కొత్త... కాంగ్రెస్ జెండా, ఎజెండా కొత్త... కేడర్, లీడర్లు... అందరూ కొత్తే! వీటన్నింటినీ జీర్ణించుకుని ఉదయగిరి నియోజకవర్గంలోనే కాదు, తన రాజకీయ జీవితంలోనూ ఆయన రెండవ అధ్యాయాన్ని మొదలుపెట్టినట్లయ్యింది.

### ఒక ఓటు అటు... ఒక ఓటు ఇటు...

కాంగ్రెస్ అభ్యర్థి కంభం విజయరామిరెడ్డి వర్గం ఉదయగిరి నియోజకవర్గంలో సరికొత్త ప్రచారాన్ని అందుకుంది. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పట్ల వున్న వ్యతిరేకతను సొమ్ముచేసుకోవాలనే ఉద్దేశ్యంతో జగన్‌కు పార్లమెంటుకు ఓటేసి, అసెంబ్లీలో మాత్రం కంభం విజయరామిరెడ్డికి ఓటేయమని కోరుతుంది. ఇప్పటికే రెండుసార్లు ఓడిపోయిన కంభం పట్ల ప్రజల్లో సానుభూతిని రేకెత్తించి లబ్ధిపొందాలని చూస్తున్నారు.

PDF Compressor Free Version





## వై.యస్. పథకాలన్నీ ఎత్తేసారు

వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ప్రజోపయోగపథకాలన్నీ ఈ ప్రభుత్వం అటకెక్కించింది. జలయజ్ఞం ఆగిపోయింది. 108ని ఎత్తివేసారు. 104 ను ఎత్తివేసారు. పావలావడ్డీ పథకం ఎత్తివేసారు. ఫీజు రీయింబర్స్ మెంటులో కోతలు విధించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీకి తూట్లు పొడిచారు. వృద్ధాప్యపింఛన్లు అందక వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఉచిత కరెంటుకు కోతలు పెడుతున్నారు. ఇదేం ప్రభుత్వం? వై.యస్. బొమ్మ లేకుండా ఢిల్లీ పెద్దలు పాలిస్తున్నారు. కాంగ్రెస్ కు భవిష్యత్తులో గుణపాఠం తప్పదు.

— మన్నెం రామయ్య, గుడూరు.

## ఉపఎన్నికలతో బుద్ధిరావాలి

ఇటీవల రాజకీయనాయకులకు దినదినం సంకటమవుతుంది. టిఆర్ఎస్, జగన్ వల్ల కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు నిద్ర కరువవుతుంది. 18 అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికలు నాయకులకు ప్రాణసంకటంగా మారాయి. నేటి తెలుగుదేశంపై తీవ్రవ్యతిరేకత వెల్లువెత్తుతుంది. అధికార కాంగ్రెస్ కు ఇరకాటంలో అదే పరిస్థితి. ఉపఎన్నికలలో జగన్ పార్టీయే 12 సీట్లు పైగా గెలుస్తుందని జగన్ కు ధీమా. ఏం జరుగుతుందో వేచిచూద్దాం.

— వాస్తవ్ రామచంద్ర, నెల్లూరు.

## భక్తితో రాజకీయమా?

తిరుమల దైవదర్శనం సమయంలో వైయస్.జగన్మోహన్ రెడ్డి డిక్లరేషన్ మీద సంతకం చేయక పోవడాన్ని రాజకీయపార్టీలు, మీడియా పెద్ద దుమారం చేయడం విచారకరం. దేవుని మీద విశ్వాసం, భక్తి వున్న వాళ్లే గుడికి వెళతారు. జగన్ క్రైస్తవుడు అయినప్పటికీ వెంకటేశ్వర్లస్వామిని పూజించడానికి దర్శనానికి వెళ్లారు. అలాంటప్పుడు నామినల్ డిక్లరేషన్ ఎందుకు? దేవుని మీద భక్తితోనే కదా వచ్చారు. ఇతర మతాలను గౌరవించే వారని మెచ్చుకోకుండా ఇలా వివాదం చేయడం తగునా? ఇప్పుడు ఎవరైనా ఇతర దేవాలయాలకు వెళితే... ఇప్పటికే ఎందరో క్రైస్తవులు ఎంతో భక్తితో వెళుతుంటారు.

— వి.సురేంద్రరెడ్డి, నెల్లూరు. (ఇ-మెయిల్)

# ప్రభాతం

ఆకలి, నిరుద్యోగం, దారిద్ర్యం, ఆర్థికమాంద్యం... ఇలాంటి సమస్యలెన్నోవున్నా... సమర్థవంతమైన నాయకత్వం, సంపూర్ణవనరులు వున్న దేశానికి వీటిని ఎదుర్కోవడం పెద్దకష్టమేమీ కాదు. ఆరు దశాబ్దాల స్వతంత్ర పాలనాచరిత్రలో భారత్ ఈ సమస్యలన్నింటిని అధిగమించుకుంటూ వస్తుంది. అయితే ఈ సమస్యలను దాటుకునే కొద్దీ తీవ్రవాద సవాళ్లు తీవ్రంగానే ఎదురవుతున్నాయి. 7500 కిలోమీటర్ల పైబడిన తీరప్రాంతం... చుట్టూ 7 దేశాలువున్నా భారత్ కు నిత్యం తీవ్రవాద సవాళ్లు ఏదో ఒక రూపంలో ఎదురవుతూనే వుంటాయి. ఇప్పుడు తీవ్రవాదం పరిధులు దాటింది. ఒకప్పుడు జమ్ము, కాశ్మీర్ ముంబై వంటి ప్రాంతాలకే పరిమితమైన పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం ఈరోజు దేశంలోని మారుమూలలకు కూడా పాకింది. ఒకప్పుడు తీవ్రవాదమంటే తుపాకులతో కాల్పులు, బాంబుపేలుళ్లు. కాని ఇప్పుడు ఉగ్రవాదం అధునిక రూపాన్ని సంతరించుకుంది. మానవ బాంబుల పరిధిని దాటిపోయి సెల్ ఫోన్ బాంబులతో అద్భుతాన్ని ఇంటర్నెట్ లో కూడా చొరబడి దేశవ్యవస్థను అన్నివిధాలా విచ్ఛిన్నం చేసే స్థాయికి చేరింది. ఒకరకంగా చెప్పాలంటే ప్రపంచంలో అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవ సమాజం కంటే ఉగ్రవాద సంస్థలు ఎక్కువగా ఉపయోగించుకుంటున్నాయి.

నానాటికి వెర్రితలలు వేస్తూ దేశ సమగ్రతకు, భద్రతకు సవాళ్లు విసురుతున్న ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత. అయితే మన దేశం దౌర్భాగ్యమేమిటంటే ఒక చట్టాన్ని రూపొందించే ముందు దానినుండి అసలు లక్ష్యంకంటే రాజకీయ ప్రయోజనాలనే ప్రధానంగా చూసుకుంటాయి ప్రభుత్వాలు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన 'పోటా' చట్టాన్ని యుపిఏ ప్రభుత్వం అటకెక్కించడంలో ఇలాంటి రాజకీయ ప్రయోజనాలే దాగున్నాయి.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి కేంద్రప్రభుత్వం రూపొందించిన ఉగ్రవాద నియంత్రణ జాతీయ సంస్థ (ఎన్ సిటిసి) ఇప్పుడు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య వివాదాలకు వేదికగా మారింది. ఉగ్రవాదంపై పోరాటం ఉమ్మడిబాధ్యత అంటూ కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. దీనిపై ఏకాభిప్రాయం సాధించేందుకు ముఖ్యమంత్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో సైతం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం హైకమాండ్ ఆదేశానుసారం ఈ బిల్లుకు మౌనంగా తలూపుతున్నారు. 12 రాష్ట్రాల కాంగ్రెసేతర ముఖ్యమంత్రులు మాత్రం ఈ బిల్లుకు తీవ్రంగా అభ్యంతరం చెబుతున్నారు. ఉగ్రవాదం అణచివేసే విషయంలో ఒకే విధానాన్ని అవలంబించాలనేది అందరి అభిప్రాయమే అయినా, పార్లమెంటుకు సైతం జవాబుదారి కాని ఎన్ సిటిసి చట్టంపై కాంగ్రెసేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు మోకాలడ్డుతున్నారు. ఎన్ సిటిసిలోని నిబంధనలు రాష్ట్రాల హక్కులను కాలరాస్తాయని, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి లేకుండా, కనీసం ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా ఏ రాష్ట్రంలోనైనా ఇష్టారాజ్యంగా సోదాలు, ఆస్తులస్వాధీనం, అరెస్ట్ లు సాగించే అధికారాలు ఎన్ సిటిసికి దఖలుపడతాయని దాన్ని వ్యతిరేకిస్తున్న ముఖ్యమంత్రుల వాదన. ఇప్పటికే సిబిఐని కేంద్రం పావుగా వాడుకుంటూ ఆయా రాష్ట్రాలపై అప్పుడప్పుడూ ప్రయోగిస్తుంది. ఇక రాష్ట్రపతిపాలన విధించే ఆర్టికల్-356 సైతం కేంద్రప్రభుత్వం చేతిలో ఓ అణుబాంబులాంటిదే! రేపు విశృంఖల అధికారాలు కట్టబెట్టి ఎన్ సిటిసిని వదిలితే అది కూడా కేంద్రప్రభుత్వం చేతిలో రిమోట్ కంట్రోలే అవుతుంది.

ఎన్ సిటిసి పట్ల ముఖ్యమంత్రులలో నెలకొన్న భయాలను తొలగించడంలో కేంద్రప్రభుత్వం విఫలమవుతుంది. ఎందుకంటే సిబిఐను కాని, ఆర్టికల్ 356ను గాని కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు దుర్వినియోగం చేసినంతగా మరే ఇతర ప్రభుత్వాలు చేసివుండవు. ఒక సంస్థను ఏర్పాటు చేయడానికిగల అసలు లక్ష్యాన్ని గాలికి వదిలేసి, ఆ సంస్థను సొంత ప్రయోజనాలకు వాడుకోవడం కాంగ్రెస్ కు వెన్నతోపెట్టిన విద్య. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చే చట్టాల పట్ల ఇతర పార్టీల నాయకులకు అంత అపనమ్మకం. ఏ చట్టాన్నైనా వీరు సక్రమంగా అమలుచేసే పరిస్థితులు రాబట్టివుంటే ఈరోజు ముఖ్యమంత్రులు ఎన్ సిటిసిని అంతగా వ్యతిరేకించరు. అందరూ ఉగ్రవాదాన్ని ఖండఖండాలుగా నరికిపారేయాలని కోరుకునేవాళ్లే! ఎన్ సిటిసి చట్టం మీద కూడా వారికి అపోహలు లేవు. కాని దానిని రూపొందించిన కాంగ్రెస్ పాలకులపైనే వారికి నమ్మకాలు లేవు. ఉగ్రవాదాన్ని ఇంకా ఉపేక్షించే స్థాయిలో లేదు. ఇంకా ఉపేక్షిస్తే దానిమూలంగా దేశం కోల్పోయేది ప్రాణాల్నే కాదు, మానాన్ని కూడా! ఎన్ సిటిసి రూపకల్పనలో కేంద్రప్రభుత్వానికి చిత్తశుద్ధి అవసరం. విదేశీ ఉగ్రవాదాన్ని కాని, స్వదేశీ తీవ్రవాదాన్ని కాని... వాటి కోరలు పీకడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడిబాధ్యత. ఉగ్రవాద నిరోధకసంస్థల ఏర్పాటు విషయంలో కేంద్రం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి దేశ సమగ్రత, భద్రత లక్ష్యంగా చేసుకుని ఎన్ సిటిసి వ్యవహారంలో రాష్ట్రాలకు భాగస్వామ్యం కల్పిస్తే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ఉమ్మడి బాధ్యతను సాధించవచ్చు.

## ఉమ్మడి బాధ్యత



కాంగ్రెస్ ప్రభుత్వం మీద విపక్షాలకున్న అపనమ్మకమే జాతీయ ఉగ్రవాద నిరోధక సంస్థ (ఎన్ సిటిసి) బిల్లుకు మోకాలడ్డుతుంది. రాజ్యాంగ ప్రతిపత్తి కలిగిన సంస్థలను తన పావులుగా వాడుకోవడం కాంగ్రెస్ నైజం. ఈ దుర్బుద్ధితోనే ఎన్ సిటిసిని కూడా యుపిఏ రూపొందించిందని విపక్షాల అనుమానం.

# అంతర్జాతీయం

- బీహార్ లో సంచలనం రేపిన దాణా కుంభకోణం కేసులో సీబీఐ ప్రత్యేకకోర్టు 34మందికి ఏడాది నుండి ఆరేళ్లపాటు జైలుశిక్ష విధించింది. శిక్ష పడినవారిలో 16మంది మాజీ ట్రెజరీఅధికారులు కాగా మిగిలిన వాళ్లు దాణా పంపిణీదారులు.
- జపాన్ లో అణువిద్యుత్ ఉత్పత్తికి తాత్కాలికంగా తెరపడింది. సునామీ వల్ల ఫుకుషిమా అణువిద్యుత్ కేంద్రంలో సంభవించిన ఉపద్రవం వల్ల జపాన్ ఈ నిర్ణయం తీసుకుంది.
- న్యాయం, చట్టం పార్లమెంటరీస్థాయి సంఘం ఛైర్మన్ గా శాంతారామ్ నాయక్ నియమితులయ్యారు. సెక్స్ రాకెట్ లో ఇరుక్కున్న అభిషేక్ మనుసింఘ్వి రాజీనామాతో ఆయన ఈ పదవికి ఎంపికయ్యారు.
- ఫ్రాన్స్ లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో ప్రస్తుత అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ ఓటమిపాలయ్యారు. సోషలిస్ట్ అభ్యర్థి ఫ్రాంకోయిస్ హోలాండేకు ప్రజలు మద్దతు పలికారు.
- ఇరాన్ నుండి చమురు దిగుమతుల్ని భారీగా తగ్గించుకోవాలని అమెరికా విదేశాంగశాఖమంత్రి హిల్లరీ క్లింటన్ భారత్ కు విజ్ఞప్తి చేసారు. మూడురోజుల భారత్ పర్యటనలో ఆదివారం ఆమె కోల్ కత్తాలో తిరిగారు.
- అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బరిలోవున్న ఒబామాకు 86 శాతం మంది అమెరికన్ భారతీయులు మద్దతు తెలుపుతున్నట్లు లేక్ రిసెర్చ్ పార్టనర్స్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది.
- ఆదివారం అమెరికా రాజధాని వాషింగ్టన్ లోని లోటస్ దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రవాసభారతీయులు పెద్దసంఖ్యలో హాజరై ఈ వేడుకను తిలకించారు.
- రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ మూడోసారి బాధ్యతలు చేపట్టి రికార్డు సృష్టించారు. పుతిన్ 12ఏళ్లుగా రష్యా రాజకీయాలపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు.
- దక్షిణాఫ్రికా పర్యటనలో వున్న భారత రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ సోమవారం 1893లో జాతి వివక్షత కారణంగా మహాత్మాగాంధీని రైల్లో నుండి తోసేసిన పీటర్ మారిట్జ్ బర్గ్ రైల్వేస్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ స్మారక కమిటీ ఛైర్మన్ దశరథ్ బంధూ ఆశీస్సులందుకున్నారు.
- అమెరికా విదేశాంగశాఖ మంత్రి హిల్లరీ క్లింటన్ 7వ తేదీ భారత ప్రధాని మన్మోహన్ సింగ్ తో సమావేశమయ్యారు. అణుఒప్పందం, ఉగ్రవాదం, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ లో పరిణామాలు ... తదితర అంశాలపై ఇరువురూ చర్చించారు.

# వార్త వ్యాఖ్య

| | | |
|---|---|---|
| వార్త | :- | తిరిగి కాంగ్రెస్ లోకి జీవిత, రాజశేఖర్. |
| వ్యాఖ్య | :- | *ఆ తర్వాత తెలుగుదేశంలోకా?* |
| వార్త | :- | త్వరలో కమ్యూనిస్టు పార్టీల టీవీ ఛానెళ్లు. |
| వ్యాఖ్య | :- | *నారాయణమూర్తి సినిమాలు ఎక్కువగా వేస్తారేమో!* |
| వార్త | :- | మా సర్కార్ ను కూల్చేందుకు జగన్ కుట్ర. – ఎన్నికల ప్రచారంలో కిరణ్. |
| వ్యాఖ్య | :- | *మీ పార్టీవాళ్లు జగన్ కు అంత ఛాన్సిస్తారా?* |
| వార్త | :- | జగన్ ఎమోషనల్ బ్లాక్ మెయిలర్. – మంత్రి రఘువీరారెడ్డి. |
| వ్యాఖ్య | :- | *జగన్ సీఎం కావాలని తొలిసంతకం మీరే పెట్టినట్లున్నారు.* |
| వార్త | :- | కోట్లు కుమ్మరిస్తే సీట్లు వస్తాయా? – సీపీఐ కు దత్తాత్రేయ కనిపించే లేఖ. |
| వ్యాఖ్య | :- | *తపాలాశాఖ మీవల్లే బ్రతుకుతున్నట్లుంది.* |
| వార్త | :- | ఇక సర్కారే మద్యం షాపులు. – సంకేతాలిచ్చిన ఎక్సైజ్ మంత్రి. |
| వ్యాఖ్య | :- | *బినామీలతో అవసరం లేకుండా పోతుంది.* |
| వార్త | :- | వ్యాపారంగా మారిన విద్య. – జెఎన్ టియు స్నాతకోత్సవంలో గవర్నర్. |
| వ్యాఖ్య | :- | *అది కూడా లాభసాటి వ్యాపారంగా...!* |
| వార్త | :- | పోటీచేసే వుంటే బాగుండేది. – ఉపఎన్నికలపై సీపీఐలో చర్చ. |
| వ్యాఖ్య | :- | *ఇంకా పార్టీకి ఓట్లేసేవాళ్లున్నారో లేదో తెలిసేది!* |
| వార్త | :- | బొత్సది బినామీల బ్రతుకు. – వడ్డె రాముడు. |
| వ్యాఖ్య | :- | *ఆయనకు మాత్రం బినామీపేర్లతో వ్యాపారాలు చేయాలని సరదానా? బీలుకాకనే కదా!* |
| వార్త | :- | రాజధాని ఫెరిగిన చోట శాశ్వతభవనం. – రిజిస్ట్రేషన్లశాఖ నిర్ణయం. |
| వ్యాఖ్య | :- | *ఎవరి రాజధాని... శాఖకా? శాఖలో ఉద్యోగులకా?* |
| వార్త | :- | వై.యస్. పథకాలన్నీ టీడీపీవే! – చంద్రబాబు. |
| వ్యాఖ్య | :- | *దేశంలో ఎవరు ఏ పథకం పెట్టినా మనదేనంటే సరి!* |
| వార్త | :- | ఉపఎన్నికల కర్పూత మళ్లీ పోరాటం. – సీపీఎం రాఘవులు. |
| వ్యాఖ్య | :- | *ఉద్యమాలు మొదలుపెట్టడానికి మీరు కూడా వారాలు, వర్జాలు చూస్తున్నట్టున్నారు.* |

# ఇసుక తుఫాన్

## ◆ సుప్రీంకోర్టు కూడా కనికరించలేదు

డబ్బులుంటే ఈరోజు మార్కెట్‌లో అన్ని వస్తువులు దొరుకుతున్నాయి. గుండుపిన్ను దగ్గరనుండి కోట్ల విలువచేసే వజ్రాల వరకు దొరకని వస్తువంటూ ఏదీలేదు. కాని ఎంత డబ్బులు ఇస్తామన్నా ఇసుక మాత్రం దొరకడంలేదు. దీంతో కాంట్రాక్టర్లు, బిల్డర్లు, గృహనిర్మాణ యజమానులు, వివిధ నిర్మాణాలు చేపట్టిన వాళ్ల నిర్మాణాలు ముందుకు సాగక ఎక్కడి పనులను అక్కడే ఆపేసి లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా సోమవారం నాడు రాష్ట్రంలో ఇసుక తవ్వకాలపై రాష్ట్ర హైకోర్టు విధించిన స్టేను ఎత్తేసేది లేదంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో ఇసుక కాంట్రాక్టర్లు, నిర్మాణదారుల నెత్తిన పిడుగులు పడ్డట్లయ్యింది. రాష్ట్రంలో ఇసుక, మద్యం... ఈ రెండు పెద్ద మాఫియాగా మారాయి. ఈ రెండింటిలోను ప్రజాప్రతినిధుల జోక్యం ఎక్కువ. బినామీలతో వాళ్లే ఈ వ్యాపారాలు సాగిస్తుంటారు. సిండికేట్‌లు నిర్వహిస్తుంటారు. మద్యంషాపుల లాగానే పోటీలు పడి ఇసుక రీచ్‌లను కోట్లాది రూపాయలకు పాడుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కూలీలను పెట్టి కొలతల్లోనే ఇసుకను తవ్వితే కోట్లు పెట్టుబడిపెట్టిన వ్యాపారులు నెత్తిన గుడ్డవేసుకోవాల్సిందే! ప్రజాప్రతినిధుల హస్తముంటుంది కాబట్టి ఇసుక తవ్వకాలను ఎలాగైనా చేసుకోవచ్చుననే ఉద్దేశ్యంతో కాంట్రాక్టర్లు కోట్లు పెట్టి ఇసుక రీచ్‌లను పాడుకున్నారు. పెట్టుబడితో పాటు ఆదాయం కూడా రాబట్టాలి కాబట్టి యథేచ్ఛగా యంత్రాలతో ఇసుక తవ్వకాలు సాగిస్తూపోయారు. నిబంధనలను తుంగలో తొక్కారు. నదీగర్భంలోని ఇసుకను మిషన్లతో తోడించారు. నదుల్లో వున్న ఇసుకను వూడ్చేసారు. పక్కరాష్ట్రాలకు కూడా ఇసుకను అమ్ముకోసాగారు.

ఇదే పరిస్థితులు కొనసాగితే నదీ పరివాహక ప్రాంతాలకు ముప్పు వస్తుందనే ఆందోళనతో కొందరు ఇసుక తవ్వకాలపై హైకోర్టులో పిటీషన్ వేయడంతో హైకోర్టు ఇసుకను తవ్వకుండా నిషేధం విధించింది. అప్పటినుండి జనం ఇసుక కోసం కటకటలాడుతున్నారు. ఇసుక కొరతతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ రంగ నిర్మాణాలు నిలిచిపోయాయి. నెల్లూరులో పెన్నా, స్వర్ణముఖి, కాళంగి నదులలో ఇసుక తవ్వకాలు ఇప్పుడు పూర్తిగా నిలిచిపోయాయి. నెల్లూరులో 200కుపైగా అపార్ట్‌మెంట్లు ఇసుకలేక నత్తనడకన సాగుతున్నాయి. మొన్నటివరకు కొందరు



రాత్రివేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకొచ్చి వెయ్యిరూపాయల ఇసుకను నాలుగు వేలరూపాయలకు అమ్ముతూ వచ్చారు. కాని పోలీసులు, విజిలెన్స్ అధికారులు దాడులు ముమ్మరం చేయడమే కాక, ట్రాక్టర్లను సీజ్ చేసి, 20వేలరూపాయల వరకు జరిమానా విధిస్తుండడంతో ఆ దొంగఇసుక కూడా ఆగిపోయి నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. నిర్మాణాలు ఆగిపోవడంతో కూలీలకు కూడా పనులు కరువయ్యాయి. మొన్నటి దాకా కూలీలు దొరకడం కష్టంగా వుంటే ఇసుక నిషేధం వల్ల ఇప్పుడు కూలీలకు పనిదొరకడం కష్టంగా వుంది. ఈ ఇసుక కష్టాలు ఎప్పుడు తీరుతాయో? కోర్టు ఎప్పుడు కనికరిస్తుందో?

# సిమ్‌తో పొంచివున్న క్రైం




సెల్‌ఫోన్ చేతిలోలేని వారంటూలేరు. రాష్ట్రంలో ఎంత జనాభా వుందో? అంతకు రెట్టింపు సిమ్‌లు వర్కింగ్‌లో వున్నాయి. సిమ్‌లు జారీచేసే కంపెనీలు ఏజెంట్లకు టార్గెట్‌లు పెడ్తున్నాయి.తప్పనిసరిగా ఇన్ని సిమ్‌లు అమ్మాలనేదే వారి టార్గెట్. కృష్ణాపట్నం, ముత్తుకూరులాంటి ప్రాంతాల్లో కూడా ఏజెంట్లు టార్గెట్‌లు పూర్తిచేస్తున్నారు. ఇదంతా ఎలా జరుగుతుంది. అంతా 'దో నంబరీ దందా'నే. ఒక్క ఐడీప్రూఫ్, పదిగా, వందగా మారుతున్నాయి. ప్రతి నెలా అన్ని కంపెనీల సిమ్‌లకు ఈ ఐడీ ప్రూఫ్‌లు జాగ్రత్తగా వాడుతున్నారు. పాస్‌పోర్ట్ ఫోటోల వ్యాపారం జిల్లాకేంద్రంలో బ్రహ్మాండంగా జరుగుతుంది. కొన్ని ఫోటో స్టూడియోలలో ఇదే పెద్దరాబడి ఎవరి ఫోటోలు అయినా టోకుగా ఇచ్చేస్తారు. అలాగే రేషన్‌దుకాణాల వారి వద్ద, లేదా ఇతరుల వద్ద కుదవపెట్టిన రేషన్‌కార్డులు జెరాక్స్‌లు వెళ్ళిపోతున్నాయి. ఇవన్నీ సిమ్‌కంపెనీల టార్గెట్‌లకు అధికారికంగా ఉపయోగపడే ప్రూఫ్‌లన్నమాట. ముత్తుకూరు మండల పరిధిలో ఎవరికి ఏ కంపెనీ సిమ్‌కార్డ్ కావాలన్నా వందరూపాయలు ఇస్తే దొరుకుతుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కృష్ణాపట్నంకు ఎక్కడెక్కడి నుంచో కార్మికులు బ్రతుకుదెరువుకోసం వచ్చి వున్నారు. వీరందరికీ సెల్‌లు, ఆంధ్రా సిమ్‌లు కావాల్సిందే. అయితే వీరివద్ద ప్రాంతీయ గుర్తింపు ఏమీ ఉండదు. ఇటువంటి వారంతా మన వ్యాపారస్తులకు లాభసాటి వినియోగదారులు. సిమ్ ఎవరి దగ్గరవుందో? అది, అతని పేరుమీద ఉండదు. ఫోటో అతనిదై వుండదు. మరో ఆశ్చర్యకరమైన జిమ్మిక్కు ఏమిటంటే కంపెనీలకు గుర్తింపులన్నీ జెరాక్స్‌లే పెడతారు. వాటిలో ఫోటో ముఖకవళికలే వుండవు. తీరప్రాంతంలో మనకు తీవ్రవాదం, ఉగ్రవాదం పొంచి వుందంటున్నారు. సిమ్ కంపెనీలు పెట్టున్న టార్గెట్‌లపై నిఘా విభాగం దృష్టిసారిస్తే ఒక్క నెలలోనే విషయం బయటకు వస్తుంది. నేరచరితలు ఎక్కడోలేరు.

## భారీగా పెరిగిన
# పెంచలకోన ఆలయాల హుండీ రాబడి

పెంచలకోన నరసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు చివరిరోజైన ఈనెల 6న స్వామివారి నిత్యకల్యాణ మండపంలో దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన తాత్కాలిక హుండీల ద్వారా రూ။16.34లక్షలు వచ్చినట్లు ప్రత్యేకాధికారి రవీంద్రారెడ్డి తెలిపారు. గతేడాది రూ။14.50లక్షలురాగా ఈ సంవత్సరం హుండీ ఆదాయం భారీగా పెరిగింది. నరసింహస్వామి, ఆదిలక్ష్మి, ఆంజనేయస్వామి ఆలయాల్లో శాశ్వత హుండీల ఆదాయం గతేడాది రూ။10.90లక్షలు కాగా, ఈ ఏడు రూ။18.93లక్షలు వచ్చిందని తెలిపారు. లడ్డూప్రసాదాల విక్రయాల ద్వారా రూ။8.15లక్షలు, టిక్కెట్లు విక్రయంద్వారా రూ။ 8.15లక్షలు రాబడి వచ్చినట్లు తెలిపారు.

# పుస్తకాలే నేస్తాలు

## డా॥మధురాంతకం నరేంద్ర

పుస్తకాలు జీవితానికి ఉన్నత సంస్కారాన్ని నేర్పిస్తాయని, సాహిత్యం అనేది జీవితానికి సార్థకత చేకూరుస్తుందని ప్రముఖ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘం సభ్యులు డా॥మధురాంతకం నరేంద్ర అన్నారు. నెల్లూరు దర్గామిట్ట లోని హోటల్ "అతిథి గ్రాండ్" సమావేశ మందిరంలో ఈనెల 7న జరిగిన "నెలనెల వెన్నెల" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రష్యన్ రచయిత టాల్‌స్టాయ్, బెంగాలీ రచయిత శరత్‌లు మనిషి మనిషిగా బ్రతకటమే గొప్ప విషయంగా చాటిచెప్పిన మహనీయులని కొనియాడారు. సభాధ్యక్షత వహించిన "సన్నిధి" వెబ్ మాసపత్రిక ప్రధాన సంపాదకులు అల్లు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈతరం యువతను ప్రభావితం చేసే కార్యక్రమాలు మరిన్ని చేయబోతున్నట్లు ప్రకటించారు. కవి పెరుగు రామకృష్ణ సభకు ఆహ్వానం పలికి ముఖ్యఅతిథిని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో పద్యకళా పరిషత్ అధ్యక్షులు డా॥గాదిరాజు సుబ్రహ్మణ్యం, వాణిజ్యపన్నులశాఖ సహాయ కమీషనర్ ఎస్.పద్మనాభరెడ్డి, ఇంజనీరు శేషారెడ్డి, కవులు మైదవోలు సత్యనారాయణ, జి.సుభద్రాదేవి, కార్టూనిస్టులు రాంప్రసాద్, బి.వి.ప్రసాద్, యోగఅంజలి సంపాదకులు పెంచలరెడ్డి, హెల్పింగ్ హ్యాండ్స్ కృష్ణారెడ్డి మొదలగువారు పాల్గొన్నారు.

# గిరిలో ఎర్రమిత్రుల ప్రచారం

ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా సిపియం పార్టీ నుండి బరిలో వున్న క్రిష్ణారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాకు వెంకటయ్యను గెలిపించేందుకు కృషి చేయాలని పార్టీ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి చంద్ర రాజగోపాల్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఉదయగిరిలోని సిపిఎం కార్యాలయంలో రాజగోపాల్ కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. వెంకటయ్య యస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి నుండి ఉదయగిరి డివిజన్ కార్యదర్శి దాకా అంచలంచెలుగా పార్టీలో ఎదిగిన కార్యకర్తగా ఆయన అభివర్ణించారు.

# నకిలీనోట్ల తయారీ ముఠా ఆటకట్టు



నకిలీనోట్లు తయారుచెయ్యడం ఎంత సులభమైపోయిందో కదా! ఎక్కడో ఒక దగ్గర ఇటీవల ఈ దొంగనోట్ల తయారీ ముఠా దొరుకుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. సాంకేతికపరమైన అభివృద్ధి కూడా ఈ పనికి హేతువవుతోంది. ఒక కంప్యూటర్, ప్రింటర్ వుంటేచాలు. కంప్యూటర్ పరిజ్ఞానంలో మంచి ప్రవేశం వున్న వ్యక్తి వీటిని తయారు చేసేస్తున్నాడు. కావలి పట్టణంలో అటువంటి సంఘటనే జరిగింది.

ఇస్లాంపేట మానికలవారి వీధిలోని చాంద్‌బాషా ఇంట్లో అద్దెకు వుంటున్న హైదరాబాద్‌కు చెందిన సిరాజ్, కంప్యూటర్ మేధావి కావడంతో రూ॥500నోట్లను తయారుచేసి ఇద్దరు వ్యక్తుల సహాయంతో చెలామణీ చెయ్యాలని చూశాడు. కాని పోలీసులకు ఈనెల 6న దొరికి పోయాడు. ఇంటి యజమాని చాంద్‌బాషాకు అనుమానం రావడంతో రాత్రిళ్లు దొంగ చాటుగా నకిలీనోట్లు తయారుచేస్తున్న సిరాజ్ గుట్టురట్టయింది. మొదట ఒక మహిళ, సిరాజ్‌లు భార్యాభర్తలమని అద్దెకు చేరారు. ప్రకాశంజిల్లా పెద్దపవనికి చెందిన పఠాన్ నజీర్, ముత్యాలపాడుకు చెందిన కాంద్ర మధుసూదనరావులతో కలిసి వీటిని చెలామణీ చెయ్యాలని సిరాజ్ ఆలోచన. చాంద్‌బాషా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ ఇందిర నేతృత్వంలో సి.ఐ.రాంబాబు, ఎస్సైలు సుబ్బారావు, వీరేంద్రబాబు కానిస్టేబుల్స్ రియాజ్, సుబ్బారావు, ఇర్షాద్, సత్యం, మస్తాన్, కామేశ్వరరావు కృష్ణారావులు వీరిని అరెస్ట్‌చేసి 80నకిలీ రూ॥500నోట్లను స్వాధీనం చేసుకున్నారు.

# మోడల్ ఫారాలు ఏర్పాటుచేసుకోండి

## వ్యవసాయశాఖ ఇన్‌చార్జ్ ఏడీ గిరీష్

రైతులకు నూతనంగా మోడల్‌ఫారాలు ఏర్పాటుచేస్తున్నామని, రైతులు తప్పనిసరిగా ముందుకొచ్చి వ్యవసాయ అధికారుల సూచనలతో మోడల్‌ఫారాలు ఏర్పాటు చేసుకోవల్సిందిగా వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీ గిరీష్ కోరారు. సోమవారం వెంకటగిరి పట్టణంలో ఆయన అభ్యుదయ రైతుల అవగాహనా సదస్సును ఏర్పాటుచేసి పలుసూచనలు ఇచ్చారు. మోడల్‌ఫారాలు ఏర్పాటుచేసుకొనే రైతులకు ప్రభుత్వం నుంచి రెండువేల రూపాయలు నగదు అందజేయటం జరుగుతుందని ఆయన వివరించారు. ఆదర్శ, అభ్యుదయ రైతులకు పంటలపై అవగాహన పెంచుకోవటం ద్వారా వ్యవసాయంపై మంచి పట్టు కలుగుతుందని, అధిక ఫలసాయం పొందగలరని ఆయన అన్నారు. సమావేశంలో పాల్గొన్న వెంకటగిరి వ్యవసాయశాఖ అధికారిణి శ్రీమతి శిరీష మాట్లాడుతూ ప్రతి రైతూ భూసార పరీక్షలు చేయించుకోవటం ఎంతో అవసరమన్నారు. అలాగే విత్తనశుద్ధిని కూడా పాటించాలని పిలుపునిచ్చారు. సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించటం వల్ల చాలావరకూ, తెగుళ్లను నివారించవచ్చని ఆమె రైతులకు వివరించారు. వెంకటగిరి ఆదర్శ, అభ్యుదయ రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# వేస్ట్‌భూముల్లో నెల్‌క్యాస్ట్ అభినందనీయం




సభలో ప్రసంగిస్తున్న జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్, నెల్‌క్యాస్ట్ జి.ఎం ఎన్.ఎస్.రెడ్డి

పచ్చటి పొలాల్లో పరిశ్రమ ఏర్పాటుచేయు సంస్కృతికి స్వస్తి చెప్పి బంజరుభూములలో పరిశ్రమ ఏర్పాటుచేయుటకు ముందుకు వచ్చిన నెల్‌క్యాస్టు లిమిటెడ్ 3వ యూనిట్ యాజమాన్యం చర్యలు అభినందించదగ్గవని జిల్లా జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ అన్నారు. మంగళవారం ఓజిలి మండలం పెదపరియ గ్రామ సమీపంలో 42 ఎకరాలలో 150కోట్లతో నెల్‌క్యాస్టు 3వ యూనిట్ ఏర్పాటుచేస్తున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు ప్రజాభిప్రాయ కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. యూనిట్‌ను ఏర్పాటుచేయడం ద్వారా ఉద్యోగావకాశాలు దొరుకుతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్‌క్యాస్టు జి.ఎం. ఎన్.ఎస్.రెడ్డి, సబ్ కలెక్టర్ వీరపాండి యన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇ.ఇ జి.ఉమామహేశ్వరరావు నెల్‌క్యాస్టు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ నరసారెడ్డి, ప్రేమ్‌కుమార్, సాయినాథన్, రవీంద్ర నాథ్‌రెడ్డి, కె.రఘునాథ్‌రెడ్డి, జీఎం మునిచంద్రయ్య, బ్రహ్మానందరెడ్డి, కోటిరెడ్డి మురళీకృష్ణ తహశీల్దార్ జిలానీబాషా, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు. నెల్‌కాస్టు పిఆర్‌ఓ ఎ.శివకుమార్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# జగన్‌ను ముఖ్యమంత్రిని చేద్దాం

## వైయస్సార్సీ సమావేశంలో మేకపాటి సోదరులు



దివంగతనేత వైయస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఆశయాలు కొనసాగాలంటే వైయస్సార్సీ పార్టీ నాయకుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేయాల్సిందేనన్నారు వైయస్సార్సీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి.

ఉదయగిరి మెరిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 6వ తేదీన జరిగిన వైయస్సార్సీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో తమపై నిందలు మోపుతున్న ఆనం సోదరులపై ఆయన విమర్శలజల్లు కురిపించారు. నమ్మిన వారిని నట్టేటముంచే స్వభావం ఆనంవారి స్వంతం అన్నారు. జగన్మోహన్‌రెడ్డి నుండి 800 కోట్లు తీసుకొని రాజకీయాలు చేస్తున్నామని, మంత్రి ఆనం రామానారాయణరెడ్డి అంటుంటే, రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకా ఆ మొత్తానికి మరో సున్నా కలిపి 8000 కోట్ల రూపాయలు జగన్ నుండి అందుకున్నామని పొంతనలేని విచిత్రధోరణితో మాట్లాడుతున్నారని మేకపాటి ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీలో తొమ్మిది సంవత్సరాలు శాసనసభ్యుడుగా వుండిన కంభం విజయరామిరెడ్డి కాంగ్రెస్‌పార్టీలోకి గెంతాడని, ఆయన నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో బహిర్గతపరచాలని సవాల్ విసిరారు.

నాడు ఆనం కుటుంబం దివంగతనేత యన్టీ రామారావుకు ద్రోహం చేశారని, ప్రస్తుతం అదే ద్రోహాన్ని మరో దివంగతనేత వై.యస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి చేస్తున్నారని దుయ్యబట్టారు. మేకపాటి సోదరులు రాజమోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డిలతో పాటు సమావేశంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్తూరుజిల్లా మాజీ పార్లమెంటు సభ్యులు జ్ఞానేందర్‌రెడ్డి, విశ్రాంత ఇన్‌స్పెక్టర్ జనరల్ బాలకొండయ్య, సమితి మాజీ అధ్యక్షులు రాజశేఖరరెడ్డి, వైయస్సార్సీ స్టీరింగ్ కమిటి సభ్యులు చిరంజీవిరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి అనిత, సూళ్ళూరుపేట మాజీ శాసనసభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం ఇంకా కర్నాటి రోశయ్య, బత్తిన సత్యనారాయణ, టీవీయస్ రాజా, ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని 8 మండలాల వైయస్సార్సీ బాధ్యులు, కార్యకర్తలు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అల్లూరులో 1928లో ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమై నేటికి పీజీ కళాశాలగా రూపుదిద్దుకున్న రామకృష్ణ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగనున్నదని కళాశాల ప్రిన్సిపాళ్లు ఎ.మధు, ఎమ్.రామకృష్ణారెడ్డిలు తెలిపారు. నెల్లూరులో విలేకరుల సమావే శంలో వారు పాల్గొని మాట్లాడారు. గత 84సంవత్సరాలుగా ఈ విద్యాలయం నుంచి వేలవేల సంఖ్యలో విద్యనభ్యసించినవారు ప్రపంచ నలుమూలల ఉన్నత స్థానాలలో వున్నారన్నారు. ఒకసారి తమ చిన్ననాటి స్మృతులు, కళాశాల మధురానుభవాలు కలబోసుకునేందుకే సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నామన్నారు.

# మనోడు మంచోడు

## టిఎస్సార్‌ను గెలిపించాలని ఆనం విజ్ఞప్తి



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆనం సోదరులు

మంచికి, మానవతకు, దాతృత్వానికి, విలువలున్న వ్యక్తిత్వానికి ప్రతిరూపంగా నిలిచే డా॥ తిక్కవరపు సుబ్బరామిరెడ్డిని నెల్లూరు లోక్‌సభ నుండి మంచి మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. 7వ తేదీ నెల్లూరు రామ్మూర్తినగర్‌లో కాంగ్రెస్‌పార్టీ లోక్‌సభ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన టి.సుబ్బరామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెన్నుపోటుదారులకు గత ఎన్నికలలో టిక్కెట్లిచ్చి మోసపోయాం, టిక్కెట్లిచ్చిన కాంగ్రెస్‌కే మేకపాటి సోదరులు నమ్మకద్రోహం చేసారు. వారి వెన్నుపోటు రాజకీయాలవల్లే ఈరోజు ఉపఎన్నికలు వచ్చాయన్నారు. ఈసారైనా ప్రజలకు మంచి చేసేవాళ్లను అందించాలనే సంకల్పంతో అధిష్టానం నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా టి.సుబ్బరామిరెడ్డిని, ఉదయగిరి అసెంబ్లీ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డిని నిలబెట్టిందని, వారిద్దరిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో గత 66ఏళ్లలో ఎన్నో ఎన్నికలు వచ్చాయి. అవన్నీ జరిగిన తీరు వేరు... కాని ఈ ఎన్నికలను మాత్రం కులం, మతం పేరుతో దెబ్బగొట్టి లబ్దిపొందాలని చూస్తున్నారని ఆయన జగన్‌పై విమర్శలు గుప్పించారు.

**విశాఖ నెల్లూరు రెండుకళ్లు:**

విశాఖపట్నం, నెల్లూరు తనకు రెండు కళ్లని నెల్లూరు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి టి.సుబ్బరామిరెడ్డి చెప్పారు. నాకింకా రెండున్నరేళ్ల రాజ్యసభ పదవి వుంది. అయినా కూడా అధిష్టానం నన్ను నెల్లూరు నుండి పోటీ చేయమనగానే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాను. జన్మభూమికి సేవ చేసుకునే భాగ్యం నాకు ఈ విధంగా దక్కింది. నా శేషజీవితాన్ని నెల్లూరులోనే గడుపుతాను. నెల్లూరు ప్రజలతో కలిసే బ్రతుకుతానని అన్నారు. జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తలందరనీ కలుపుకుపోతాను. వారి సహకారంతో, నెల్లూరు ప్రజల ఆశీస్సులతో ఉపఎన్నికలలో తప్పకుండా విజయం సాధిస్తానని టి.సుబ్బరామిరెడ్డి ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసారు.

# తుపాకి మిస్‌ఫైర్

గురువారం సాయంత్రం నెల్లూరు ఇందిరాభవన్ వద్ద నెల్లూరుకు చెందిన ఏ.ఆర్. కానిస్టేబుల్ తుపాకి పొరపాటున పేలడంతో పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ గన్‌మెన్‌కు తీవ్రగాయాలయ్యాయి. బొత్స సత్యనారాయణ గురువారం కలిగిరి మండలంలో పర్యటన ముగించుకుని ఇందిరాభవన్‌లో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తల తొక్కిసలాటలో బందోబస్తు విధులకు వచ్చిన ఏఆర్ కానిస్టేబుల్ తుపాకి పొరపాటున పేలి ఈ సంఘటన చోటు చేసుకుంది. గాయపడ్డ గన్‌మెన్‌ను వెంటనే రామచంద్రారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

# కోడ్ అతిక్రమిస్తే చర్యలు తప్పవు




ఎన్నికల నియమావళి మార్గదర్శకసూత్రాలు తూచా తప్పకుండా పాటించేటట్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ ఎన్నికల కమిటీ అధికారులు, తహశీల్దార్లను ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నిర్వహణ ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలని, ఉపఎన్నికల్లో అభ్యర్థులు కోడ్ అతిక్రమిస్తే వాటిని వీడియోతీసి వ్యయకమిటీ, రిటర్నింగ్ అధికారులకు పంపాలని కోరారు. చెక్‌పోస్టుల వద్ద మద్యం, నగదు సరఫరాపై తనిఖీలు చేయాలన్నారు. బెల్టుషాపులపై తనిఖీలు నిర్వహించి నివేదికలు పంపాలని, బెల్టు షాపులున్నట్లు తెలిస్తే వి.ఆర్.ఓ లపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జేసీ సౌరభ్‌గౌర్, ఏజెసీ బి.లక్ష్మీకాంతం, డి.ఆర్.ఓ రామిరెడ్డి, పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు కాటంరెడ్డి స్ట్రోక్!



- అటుకులు చిటుకులు మారిన ఇన్‌ఛార్జులు
- కావలికి వాకాటి... కోవూరుకు ఆదాల
- విష్ణు పోకడలతో నిర్వీర్యమవుతున్న కావలి కాంగ్రెస్





రాజులు పోయారు... రాజ్యాలు పోయాయి. అయినా కొందరు నాయకులలో నియంతృత్వపు పోకడలు మాత్రం పోవడం లేదు. నలుగురిని కలుపుకుని పోవాల్సిన చోట నేనొక్కడినే రాజ్యమేలాలంటున్నందువల్ల పదిమందికీ దూరమవుతున్నారు.

జిల్లాలో నెల్లూరు లోక్‌సభ, ఉదయగిరి అసెంబ్లీ ఉపఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీల వారీగా కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జులను పీసీసీ నియమించింది. దీనిప్రకారం మొదట కావలి అసెంబ్లీ నియోజకవర్గానికి సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిలను నియమించడం జరిగింది. అయితే కావలికి తనతో పాటు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఇన్‌ఛార్జ్‌గా నియమించడాన్ని కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి జీర్ణించుకోలేక పోయాడు. నేను పాలెగాడినికానా? నేను మొనగాడిని కానా? కావలికి నేనొక్కడినే చాలనా? కావలిలో నాతోపాటు ఇంకొకరిని ఇన్‌ఛార్జ్‌గా నియమించడమేంటంటూ ఆయన నియంతపోకడలకు పోయాడు. కావలి నియోజకవర్గంలో నియంతృత్వపు రాజకీయాలు కలికి యానాదిరెడ్డితో పాటే కాలం చెల్లిపోయాయి. చివరిదశలో కలికి పెదధోరణులను సైతం కావలి ప్రజలు తిరస్కరించి ఇంటికి పంపించారు. విష్ణు కూడా కలికి లాగా కావలిని ఏలాలనుకుంటున్నాడేమో! అల్లూరు నియోజకవర్గం వున్నప్పుడే ఆయన తెలుగుదేశం వ్యతిరేక గాలిలో, లేదా వై.యస్. ప్రభంజనంలో గెలిచాడు. 2009లో కావలి అసెంబ్లీ నుండి మొదటిసారి పోటీ చేసి, వై.యస్. అనుకూల వాతావరణంలో కూడా జిల్లాలోనే భారీతేడాతో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి ఆయన. వై.యస్. మరణానంతరం తలెత్తిన పరిణామాలలో జగన్ వెంట వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరాడు. అక్కడ ఈయన పోకడలు సాగక తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చాడు. కాంగ్రెస్‌లోకి వచ్చాక ఆయన తాను వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరేటప్పుడు తన వెంటరాని కాంగ్రెస్ కార్యకర్తలను, నాయకులను వేధిస్తున్నాడు. కాబట్టే కావలి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈయనకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు ఇవ్వొద్దంటూ మొత్తుకున్నారు.

పాపం... సీనియర్ అని చెప్పి వైయస్సార్ కాంగ్రెస్‌లో కెళ్లి తిరిగొచ్చినా కావలి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగిస్తే, పేనుకు పెత్తనం అప్పగించినట్లయ్యింది. విష్ణు అతిధోరణివల్ల ఆదాల ప్రభాకర్‌రెడ్డి మనస్థాపం చెంది కావలి ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుండి తప్పుకున్నారు. అయితే కాంగ్రెస్ నాయకత్వం సత్వరం స్పందించి ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డిని కావలి ఇన్‌ఛార్జ్‌గా, ఆదాల ప్రభాకర్‌రెడ్డిని కోవూరు ఇన్‌ఛార్జ్‌గా నియమించింది.

కావలిలో విష్ణు నియంతృత్వ పోకడలు ఇలాగే సాగితే కాంగ్రెస్‌లో అరకొర మిగిలిన కేడర్, లీడర్లు కూడా పార్టీని వదిలిపోయే అవకాశాలున్నాయి.

## ● రిజిస్ట్రేషన్ విధానంలో...

# దొంగదారులెన్నో!



నలభై సంవత్సరాల క్రితం రిజిస్ట్రేషన్ కార్యాలయం చెట్ల క్రింద బావుపాటి ఇంక్ పెన్ను జేబులో పెట్టుకొని పెద్దరికానికి ట్రేడ్‌మార్క్‌లా వున్నవారు కొందరు కనిపించేవారు. అలాగే చెట్లక్రింద చాపలు పరుచుకొని దస్తావేజులు వ్రాసే వారూ వుండే వారు. ఇళ్లు, భూములు వగైరా ఆస్తులు అమ్ముకొనేవారు కొనుగోలు చేసే వారు వారి దగ్గరకొస్తే, పాత దస్తావేజులు పరిశీలించి, అనుభవం జోడించి, దస్తాలు తయారుచేస్తే బాటిని సంబంధిత రిజిస్ట్రార్ లేదా సబ్‌రిజిస్ట్రార్‌లు చదివి రిజిస్ట్రేషన్లు చేసేవారు. రిజిస్ట్రేషన్ సమయంలో తప్పనిసరిగా ఒకరో ఇద్దరో సాక్షి సంతకాలు పెట్టాల్సిన అవసరం ఉండేది. అప్పుడు ఈ చెట్ల క్రింద ట్రేడ్‌మార్క్ జీవులు తమ జేబులోని దొడ్డకలాన్ని మూత తీసి రిజిస్ట్రార్ వద్దకు వచ్చి సాక్షి సంతకం చేసేవారు. అందుకు గాను అప్పుడు రెండు రూపాయలు ఆయనకు ఆస్తి కొనుగోలుదారుడు ముట్టజెప్పేవారు.

దస్తావేజుల తారుమారు, సర్వే నెంబర్ల మార్పు, ఫోర్జరీ సంతకాలు, నిద్ర పోయేటప్పుడు లేదా అనారోగ్యంతో, కాకపోతే నేడో రేపో గుటుక్కుమంటారను కున్నప్పుడు సిరాతో ఎడమచేతి బొటన వ్రేలు తడిపి తెల్లకాగితం మీద వ్రేలి ముద్ర వేయించుకొని తర్వాత ఆస్తి వీలునామా వ్రాయించుకున్నవారూ ఉన్నారు. వాస్తవంగా అధికారంగలవారు వచ్చి పేచీపెడితే గుండాల కన్యాకుల్యంలో రామప్పపంతుల్లా వ్యాఖ్యాలు నడిపేవారు.

తర్వాతర్వాత రిజిస్ట్రేషన్‌శాఖ కొంచెం పకడ్బందీగా తయారయింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంలో సాంకేతికంగా మార్పులు జరిగాయి. విభాగం ఉన్నతాధికారి ఇన్‌స్పెక్టర్ జనరల్ అండ్ కమీషనర్ పదవిలో ఉండే వ్యక్తి ఆయనకు తగ్గట్టు చట్టం వేసుకుంటూపోతూ వుంటారు. దస్తావేజులు తిరగవ్రాసే భద్రపరచే రోజులు పోయాయి. ఆన్‌లైన్ కంప్యూటర్ సిస్టమ్ ప్రస్తుతం నడుస్తుంది. అమ్మకందారు కొనుగోలుదారుల ఫోటోలు ఐడెంటిటీలతో పాటు వారు కోరుకున్న ఇద్దరు సాక్షుల సంతకాలు, వేలిముద్రలు తీసుకుంటున్నారు. కాగా ఇటీవల సదరు కమీషనర్ గారి ఆదేశానుసారం సాక్షి సంతకం చేసే వారు సైతం ఫోటోలు, ఐడెంటిటీలు ఇవ్వాలన్నారు. ఇంత వరకూ ఎలాగోలా దేన్నో మసకొంది. మార్చి 31వ తేదీన ఒక ఉత్తర్వు జారీఅయింది. అదేమిటంటే రాష్ట్రంలో ఎక్కడ రిజిస్ట్రేషన్‌కోసం ఇరువురు వ్యక్తులు వస్తే (అమ్మేవారు – కొనేవారు) చాలు ఆస్తి వివరాలు డాకుమెంటేషన్ చేసి సర్వే నంబర్లు వేసి, డాకుమెంట్ రైటర్ వ్రాసేస్తే చాలు ఆ ఆస్తికి సంబంధించిన దస్తావేజులు, లింక్ డాకుమెంట్లు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, టైటిల్‌డీడ్స్‌ను రిజిస్ట్రేషన్ శాఖ కోరదు. అవి చూపమని పత్తిడి చేయదు. రిజిస్ట్రేషన్ చేసేస్తుంది. కొన్నవాడి మోసాలిబిర్రు, అమ్మేవాడి ధైర్యం. ఏదైనా గొడవ జరిగితే కోర్టు వ్యాజ్యం–జీవితాలు గడిచిపోతాయి.

ఖర్మకాయలో గుజ్జులేకుండా ఇలాంటి ఉత్తర్వులు జారీచేసి దొంగమార్గాల్ని మరింత సుగమం చేస్తున్నారన్నమాట మరి. భూపరిపాలనకు ఒక ప్రత్యేక కార్యదర్శి, రెవెన్యూ యంత్రాంగం మొత్తం, రెవెన్యూ పరిపాలనకు మరో ప్రత్యేక కార్యదర్శి, సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు ఒక కమీషనరు, స్టాంప్స్‌అండ్ రిజిస్ట్రేషన్‌శాఖకు కమీషనర్ మరియు ఐజి... వీళ్ళందరినీ ప్రభుత్వం ఏమి చేయాలి. ఏమి చేయదు. ప్రభుత్వానికి కావల్సింది ఆదాయం. రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా భారీగానే ఆదాయం వస్తుంది. ఇప్పుడంతా హైటెక్. చెట్లు క్రింద చాపలు పోయి ఏసి క్యాబిన్‌లు. ధార్ద పేనా సాక్షులేరు.. కంప్యూటరీకరణ పద్ధతి ఫోర్జరీలు చాలా సులభం అయిపోయాయి. ఇలాంటి సమయంలో బ్రహ్మాండమైన ఆయుధాన్ని మెమోరూపంలో అందించారు. ఇంక అడవి భూములుండవు. రైల్వే స్థలాలు, నదులు, నా ఇల్లు, నీ ఇల్లు, నీఆస్తి, నా ఆస్తి తరతరాలుగా వున్న ఆస్తులు, ముఖ్యంగా దేవుళ్లమాన్యాలు, వక్ఫ్ భూములు, క్రిస్టియన్ ఆస్తులు అన్నీ అన్యాక్రాంతాలే. ఇంతటి భూదందా చూసి ఇంకా న్యాయం కొంచమైనా నిలిచి వుందని హైదరాబాద్‌కు చెందిన పి.చంద్రసేనారెడ్డి అనే న్యాయవాది రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో పిల్‌దాఖలు చేశారు. చూడాలి న్యాయవ్యవస్థ సత్తా. మన రిజిస్ట్రేషన్‌శాఖను దేశవ్యాప్తంగా తెల్గీ అనే మహానుభావుడు కొన్ని వేలకోట్లు నకిలీస్టాంప్ పేపర్ల ద్వారా చేసిన మోసం అంతా–ఇంతా కాదు. ప్రభుత్వం చివరాఖరుకు ఏమిచేసింది. ఆ నకిలీ వాటినీ అలాగే కొనసాగించేసింది. ఇది ప్రభుత్వ వైఫల్యమని ఆనాడు గగ్గోలు పెట్టారు. కొన్నాళ్లకు మరొక కుంభకోణం, ఆ తర్వాత మరొకటి ప్రజలు మర్చిపోతూ వుంటారు. ప్రభుత్వ అధికారులు తాము గడించుకొనేందుకు అస్మదీయుల ఆదాయానికి ఇలాంటి జిమ్మిక్ చేసేస్తూ వుంటారు.

సదరు ఉత్తర్వు అమలయ్యిందంటే సామాన్యులందరూ ఉట్టబుట్టా సర్దుకొని రెడీగా ఉండండి. మీ భూమి కానీ, ఇల్లుకానీ, మీది కాదు–మాదంటూ ఎవరో ఒకరు వస్తారు. అప్పుడు సర్దుకొనే దానికంటే ముందుగానే జాగ్రత్తపడండి. రాష్ట్ర ప్రజలారా మీరు చల్లంగుండాల.

కంప్యూటర్‌యుగంలో మిమ్మల్ని దోచుకోవటం ఎంత సులభం అంటే మాటల్లో చెప్పలేనంత. రాతల్లో రాయలేనంత.

# పోరు.. హోరు...!

- వేడెక్కుతున్న ఎన్నికల ప్రచారం
- తరలివస్తున్న అగ్రనేతలు
- ఎన్నికల సన్నాహాల్లో అధికారులు
- ఓట్ల కోసం నేతలు... నోట్ల కోసం ఓటర్లు

భానుడి భగభగ ఓ పక్క... ఎన్నికల సెగ మరోపక్క... నెల్లూరుజిల్లాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మండుటెండల్లో ఉప ఎన్నికలు అన్ని రాజకీయపార్టీల నాయకులకు అగ్నిపరీక్షగానే మారాయి. గుండెలవిసే ఎండల్లో తిరగలేక అభ్యర్థులు చెమటలు కక్కుతున్నారు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 18 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరుగుతుండగా అన్ని రాజకీయపార్టీలు కూడా ప్రధానంగా నెల్లూరు జిల్లా మీదనే దృష్టిని కేంద్రీకరించాయి. దీనికి కారణం ఒక అసెంబ్లీతోపాటు ఏకైక లోక్‌సభ ఎన్నికకు నెల్లూరుజిల్లా కేంద్రం కావడమే. రాష్ట్ర రాజకీయ భవిష్యత్ ఏ విధంగా వుండబోతుందో ఈ ఉపఎన్నికల ద్వారానే తేలబోతుంది. ఈ ఉపఎన్నికలలో వచ్చే ఫలితాలను బట్టే చాలామంది నాయకుల తలరాతలు మారనున్నాయి.

కాంగ్రెస్, తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్... మూడు పార్టీలకు కూడా ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యే!

జిల్లాలో ఎన్నికలు జరుగనున్న నెల్లూరు పార్లమెంట్‌కు, ఉదయగిరి అసెంబ్లీకి ఇప్పటికే మూడుపార్టీలు అభ్యర్థులను రంగంలోకి దింపాయి. నెల్లూరు లోక్‌సభ పరిధిలో వైయస్సార్ కాంగ్రెస్‌కు ఎదురులేదనుకుంటున్న తరుణంలో కాంగ్రెస్ అభ్యర్థిగా టి.సుబ్బరామిరెడ్డి రంగంలోకి దిగడం అనేకమార్పులకు నాంది పలుకుతుంది. ప్రజలలో జగన్ అంటే అభిమానముంది. అదే సమయంలో సిట్టింగ్ ఎంపీగా వుండిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి పట్ల వ్యతిరేకత వుంది. నెల్లూరుజిల్లాలో వ్యక్తిగత సంబంధాలకు ప్రాధాన్యత ఎక్కువగా వుంటుంది. సుబ్బరామిరెడ్డి ఆ సంబంధాలను ప్రభావితం చేయగలరు. ముఖ్యంగా నెల్లూరు లోక్‌సభ తూర్పుప్రాంతంపై ఆయన ప్రభావం ఎక్కువగా వుంటుంది. వివాదరహితుడు కావడం, బయట ప్రాంతంలో వున్నా నిత్యం జిల్లావాసులతో సంబంధాలు కలిగి వుండడంతో పార్టీలకతీతంగా చాలామంది ఆయనకు సహకరించే అవకాశాలున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థికి జగన్ ఇమేజ్ ఒక్కటే సానుకూల అంశం కాగా, టీయస్సార్‌కు ప్రభుత్వ వ్యతిరేకత ఒక్కటే ప్రతికూల అంశం. మిగతావన్నీ ఆయనకు అనుకూలమే. టీయస్సార్ విషయంలో జిల్లా కాంగ్రెస్ నాయకగణమంతా ఏకతాటిపై నడుస్తుండడం గమనించాల్సిన విషయం. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్‌కు ఆనం సోదరులే పెద్దదిక్కు. టీయస్సార్‌ను గెలిపించాల్సిన బాధ్యతను వాళ్లిప్పుడు తమ భుజాలకెత్తుకున్నారు. తెలుగుదేశం అభ్యర్థి వంటేరు వేణుగోపాలరెడ్డి కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్‌ల మధ్య చీలే ఓట్ల మీదే ఆశలు పెట్టుకునివున్నారు. జిల్లాలో తెలుగుదేశం ఓటుబ్యాంకు అలాగే వుందని, కాంగ్రెస్, వైయస్సార్‌కాంగ్రెస్‌లు ఎంత పోటీగా ఓట్లు చీల్చుకుంటే అంత తమకు లాభమనే ఆశ తెలుగుదేశం పార్టీ వారిది. వంటేరు తన ప్రచారం ముమ్మరం చేసారు కూడా!

ఉదయగిరి అసెంబ్లీ ఎన్నికల పోరు కురుక్షేత్రాన్ని తలపించడం ఖాయం. వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా రాజీనామా చేసిన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వుండగా, తెలుగుదేశం నుండి బొల్లినేని రామారావు, కాంగ్రెస్ నుండి కంభం విజయరామిరెడ్డి రంగంలో వున్నారు. రాష్ట్రమంతటా వున్నట్లే ఇక్కడా జగన్ ఫోబియా వుంది. అదే సమయంలో స్థానిక ఎమ్మెల్యేగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పట్ల కొంత వ్యతిరేకతా వుంది. తెలుగుదేశంకు సంప్రదాయ ఓటుబ్యాంకు వుంది. నియోజకవర్గంలో కమ్మ సామాజికవర్గం ఎక్కువ. ఖచ్చితంగా సూటిగా 90ఓట్లు తెలుగుదేశానికే! కాంగ్రెస్ అభ్యర్థి కంభం విజయరామిరెడ్డికి వ్యక్తిగతంగా కొంత పట్టుంది. కాంగ్రెస్‌కు కొంత ఓటుబ్యాంకుంది. అయితే కాంగ్రెస్ కేడర్ చాలావరకు వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరింది. మిగిలిన కేడర్‌తోనే ఆయన నెట్టుకు రావాలి. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇక్కడ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ కావడంతో ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. అయితే ఎవరు సవాల్‌గా తీసుకున్నా జనంలో వున్న ట్రెండ్‌ను ఎవరూ మార్చలేరు.

అన్ని పార్టీల అతిరథనేతలు జిల్లాలో ఎన్నికల ప్రచారానికి కదిలివస్తున్నారు. ఇప్పటికే పీసీసీ అధ్యక్షులు బొత్స సత్యనారాయణ రాగా, తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు తిరుగుతున్నారు. సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్‌ల ప్రచారం వుండొచ్చు. ఇక రాష్ట్ర స్థాయి నాయకులు, సినిమాయాక్టర్ల రాకతో నెల్లూరుజిల్లాలో ఎన్నికల వాతావరణం వేడెక్కబోతుంది.

# నమో! నమో! నారసింహా నమో! నమో!



జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం పెంచలకోనలో పెనుశిల నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 1న బ్రహ్మాండంగా ప్రారంభమయ్యాయి. గోనుపల్లి గిరిజనవాడ నుంచి చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి అమ్మవార్ల సమేతంగా పెంచలనృసింహస్వామి పల్లకీలో బయలుదేరాడు. అత్తవారింటి కానుకలైన ముంజెతిగడ్డలు, పుట్టతేనె, ఆరి మొలతాడు స్వామి స్వీకరించగా, పల్లీపతి నుంచి పసుపు, కుంకుమ, పేరసారెను చెంచులక్ష్మి అమ్మవారు తీసుకొని గోనుపల్లి గ్రామానికి చేరుకున్నారు. అక్కడ నుంచి కోనకు వెళుతూ గ్రామ సమీపంలోని గొల్లబోయ స్వామికి మొదటి దర్శనభాగ్యాన్ని కలిగించి ప్రత్యేక పూజలు, మొక్కుల తదుపరి మంగళవాయిద్యాల నడుమ పల్లకిలో ఊరేగుతూ కోనకు చేరుకున్నారు. 2వతేదీ రాత్రి తిరుచ్చి వాహనంపై ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో కలిసి ఆసీనులైన శ్రీవారికి 1008 దీపాల వెలుగులో జరిగిన ఊంజల్‌సేవ భక్తులకు కనువిందు చేసింది. 3వ తేదీ ఉదయం నయనానందకరంగా అలంకృతులైన ఉత్సవమూర్తులను పెంచలకోనలోని నాలుగువీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం అలంకార మండపంలో ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. రాత్రి బంగారు హనుమంత వాహనంపై కొలువు దీరిన స్వామి వారిని వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ బాణసంచా వేడుకలతో ఊరేగించారు. 4వ తేదీ ఉదయం సింహవాహనంపై దర్శనమిచ్చిన స్వామి మధ్యాహ్నం అలంకార మండపంలో ఉభయదేవేరుల నడుమ ప్రత్యేక అభిషేకాలు అందుకున్నారు. బంగారు గరుడవాహనంపై తేజోవంతంగా దర్శనమిచ్చిన నృసింహుని చూడడానికి రెండుకళ్ళు చాలలేదు. రకరకాల పుష్పాలలో శోభిల్లిన స్వామిని చూడడానికి అశేషంగా భక్తులు తరలివచ్చారు. 5వతేదీ ఉదయం 10గంటలా 45నిమిషాలకు కల్యాణ మండపంలో అడుగిడిన శ్రీవారికి ఉభయదేవేరులతో ఆలయ ప్రధానార్చకులు సీతారామస్వామి శోభాయమానంగా కల్యాణం జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రవీంద్ర రెడ్డి, ఆలయ సహాయ కమీషనర్ శ్రీరామమూర్తి మొదలగువారు పాల్గొన్నారు. అదే ముహూర్తానికి 150మంది నూతన వధూవరులు స్వామి సన్నిధిలో దంపతులయ్యారు. 6వ తేదీ ఉదయం చక్రస్నానం, వసంతోత్సవం, అభిషేకం జరుపుకున్న స్వామి రాత్రి పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మే 1 నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 6 రాత్రి ధ్వజావరోహణంతో వైభవంగా ముగిశాయి.

PDF Compressor Free Version



PDF Compressor Free Version



# సాక్షికి సంకెళ్లు!

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికీ మరలిపోలేని సంపదుటున కాంగ్రెస్ నాయకుల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఏర్పాటు చేసే ముందు సోనియాజీ అంగీకారం కూడా వైయస్ తీసుకోవడం జరిగింది. తన మాట, తన రూపు, తన సేవలను ప్రజల ముందుంచే దుకు తన మీడియా 2009 ఎన్నికల్లో పోషించిన పాత్ర చిరస్మరణీయం. ప్రకృతి ఆయన మీద ప్రకోపించింది. అనుకోని ప్రమాదంలో అసువులు బాసాడు.

నేడు వైయస్ జగన్మోహన్‌రెడ్డిలపై రచ్చరచ్చ చేస్తున్న కాంగ్రెస్ నాయకులంతా ఆనాడు కాగడాలు చేతుల్లో పట్టుకొని పావురాళ్లగుట్ట అటవీప్రాంతాల్లో దేవులాడినవారే. ఒక ప్రక్క ప్రమాద రక్తమరకలు ఆరకముందే ఆయన వారసునిగా జగన్‌ను చేయాలంటూ సంతకాలు గీకిన వారే. నేడు సాక్షికి సంకెళ్లుపడితే సంతోషిస్తున్నారు. ఆర్థిక నేరస్తుడిగా ముద్రవేసి, అందుకు దివంగతనేత వైయస్‌ను కూడా బాధ్యుడ్ని చేసి ఊహించిన దానికంటే ఎక్కువగా నోరు జారేస్తున్నారు.

రాష్ట్రంలో మద్యం, మైనింగ్, ఇసుక మాఫియాలకు నాయకత్వం వహిస్తున్న నాయకులు ఆర్థికనేరస్తులు కారా? అని ప్రజలు నిలదీస్తున్నారు. కేవలం సోనియా మాటకాదని వ్యతిరేకించి వైయస్సార్‌ని స్థాపించి, రాష్ట్రంలో రాజకీయ పెను సునామీగా మారటం ఒక్కటే అవినీతియుతగా పరిగణించి తన పెంపుడు.....లాంటి వ్యవస్థను ఉసికొల్పి ఒకే ఒక్క వ్యక్తిని టార్గెట్ చేయటం అనూనుమం అన్నది వైయస్ అభిమానుల మనసులోని మాట.

ఒక వ్యక్తిని బలహీనపరచాలంటే ఆ వ్యక్తి ఆర్థికమూలాలను దెబ్బతీయాలనే తుచ్ఛ ఆర్థికసూత్రాల మీద ఈ కుట్ర జరిగింది. జరుగుతూ వుంటుంది.


ఒక సంస్థను స్థాపించటం, దానిని విస్తృతపరచటం ఒక్కరోజులో జరగదు. అందుకు ఎన్నోశాఖల అనుమతులు కావాలి. సాక్షి మీడియా కూడా ఇందుకు అతీతమేమీకాదు. గతంలోని మీడియా సంస్థలన్నీ కూడా ఈ అనుమతులు పొందేందుకు తమదైన పరిధిని అనుసరించినవే. కాకుంటే కొన్ని సంస్థలు నిలదొక్కుకున్న తర్వాత అక్షరాలను అమ్ముకుంటుంటే - అన్ని వార్తలతో పాటు, సాక్షి మీడియా జగన్ వాయిస్‌ను కూడా వినిపిస్తోంది. దీనినే భరించలేకుండి కాంగ్రెస్ పార్టీ. తనదైన శైలిలో ఆ వటవృక్షం తన నీడన సాక్షి మీడియాని, యాజమాన్యాన్ని, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని వచ్చిపడనీయరాదని నిర్ణయించుకుంది. "నీ నిర్ణయంతో నాకు పనిలేదు. ప్రజానిర్ణయమే శిరోధార్యం" అంటూ తనదైన శైలిలో పయనిస్తున్న జగన్‌ను రాజకీయంగా పతనం చేయటమే, అతినేత్రి అంతర్గతం. అదే జరుగుతుంది. భవిష్యత్తులో ఏమైనా జరగవచ్చు. ఉపఎన్నికలు జగన్‌తో పనిలేకుండానే వైయస్‌పై వున్న అభిమానం కాంగ్రెస్‌ను ఖంగు తినిపిస్తుందనేది రాజకీయ విశ్లేషకుల వ్యాఖ్య. ఇదే ఇట్లుంటే 2014లో కాంగ్రెస్‌పార్టీ మనుగడ రాష్ట్రంలోనే కాదు, కేంద్రంలోనూ ప్రశ్నార్థకమే. మీడియా ఖాతాలను ఫ్రీజ్ చేసినంత మాత్రాన్నే ఏదో సాధించామనుకుంటే అంతకంటే అర్థరహితం మరొకటిలేదు. జగన్ ఒక్క పిలుపిస్తే చాలు. రూపాయి నుండి కోటి వరకూ చందాలు వేసి సాక్షిని నడిపించుకుంటామని అభిమానులు ఈ రోజు కోట్లాదిమంది వైయస్ కుటుంబాని కున్నారు. కేవలం "ఖాతా"లను స్తంభింపజేస్తే మీడియాను నియంత్రించినట్లు భావిస్తే అది పూర్తిగా భ్రమే.

ప్రస్తుతం సమాజంలో ప్రతి వంది మందిలో తొమ్మిది మంది ఆర్థికనేరాలు చేస్తున్నవారే. వీరిని నియంత్రించాలంటే వేలవేల సిబిఐలు కావాలి. సిబిఐని తన మానాన తన విధులు నిర్వహించనీయకుండా కనపడని చేతితో ఆడిస్తున్నందువల్లే ఇలాంటి వింత ధోరణులు, విచిత్ర పోకడలతో ఆ సంస్థ ఉన్న గౌరవాన్ని పోగొట్టుకుంటుంది.

ప్రభుత్వ విభాగాలు కన్నువిప్పితే ఎన్నో సంస్థల యాజమాన్యాలు (మీడియా సంస్థలతో పాటు) ఆర్థిక నేరస్తుల జాబితాలో చేరకమానవు. అందుకే ఇది రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయవేట. ఈ 'వేట' ఇంకా చాలామంది మీద పడే అవకాశాలున్నాయి. అయితే ఎక్కడికక్కడ 'బాంచన్ నీకాల్మొక్తా' అంటూ సాగిలపడే వారి వైపుకు ఎవరూ కన్నెత్తి కూడా చూడరు. సాక్షికి 'సంకెళ్లు' తాత్కాలికమే.



ఈ నెల 8వ తేదీ హైద్రాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలో జి.వి.ఆర్. ఆరాధనా కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కళా సుబ్బారావు స్మారక అవార్డు ప్రదానోత్సవ సభలో శాస్త్రీయ సంగీత విభావరి నిర్వహించిన నెల్లూరుకు చెందిన సంగీత విద్వాంసురాలు శ్రీమతి ఏ.లక్ష్మీప్రసన్నను సత్కరిస్తున్న పద్మభూషణ్ డా॥ సి.నారాయణరెడ్డి, ఫౌండేషన్ ఛైర్మన్ గుడిబండ వెంకటరెడ్డి.



ఈ నెల 8వ తేదిన నెల్లూరు ఇందిరాభవన్‌లో నెల్లూరు లోక్‌సభ ఎన్నికల ప్రచార కరపత్రాన్ని విడుదల చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ నాయకులు టి.బాలసుధాకర్, పి.మల్లికార్జున, పి.ఆనంద్‌బాబు, తోట సాయిగోపాల్, టి.సువార్తమ్మ తదితరులు.

# ఇలా చేస్తే ఎలా?

## మేకపాటిపై పెరుగుతున్న అసంతృప్తి









పేనుకు పెత్తనం ఇస్తే నెత్తంతా కొరికి పెట్టిందంట... అలావుంది వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో మేకపాటి సోదరుల పరిస్థితి. వై.యస్. వున్నంతవరకు ఆయన పంచన ఆయన పంచె పట్టుకుని తిరిగిన నాయకులంతా ఆయన మరణానంతరం ప్లేటు ఫిరాయించడం చూస్తూనేవున్నాం. కాని కాంగ్రెస్ నుండి జగన్ బయటకు వచ్చాక ఆయనను అనుసరించి వచ్చిన ఏకైక ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి. ఆయన సోదరుడు ఎమ్మెల్యేగా వుంటూ జగన్ వెంట వచ్చేయడం తెలిసిందే. మేకపాటి రాజమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌ను వదిలి జగన్ వెంట రావడం ఆశ్చర్యపరిచే విషయమే. దీనికి చాలామంది చాలా కారణాలు చెబుతుంటారు. ఎవరెన్ని విధాలుగా అనుకున్నా పదవులే ప్రాణంగా బ్రతికే నాయకులు పదవిని కూడా పణంగా పెట్టి ఒక నాయకుడిని అనుసరించి వెళ్లడమంటే తమాషాకాదు. మేకపాటి సోదరులు అదే చేశారు. వై.యస్. పట్ల వున్న అభిమానంతో జగన్‌ను అనుసరించారు.

అందుకు తగ్గట్టుగానే రాష్ట్రంలో ఏ నాయకుడికీ ఇవ్వనంతటి గౌరవం, గుర్తింపును మేకపాటి సోదరులకు ఇస్తున్నాడు జగన్. ఆ అవకాశాన్ని మేకపాటి సోదరులు సద్వినియోగం చేసుకుంటే ఫర్వాలేదు. కాని తమ మెహర్బానీ కోసం దుర్వినియోగం చేస్తున్నారని పార్టీలోని కార్యకర్తలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో వాళ్ల సీట్లవరకు వాళ్లు చూసుకుంటే ఫర్వాలేదు. మిగతా వాటిల్లో కూడా వేలుపెడుతున్నారు. వాళ్ల నియోజకవర్గాల్లోనే వాళ్లు సక్రమంగా ఏదవలేరు... పక్క నియోజకవర్గాలలో వనేంటనే విమర్శలు కూడా వస్తున్నాయి. మొన్న కావలి నియోజకవర్గానికి కన్వీనర్‌ను పెట్టడంలోనే తప్పుచేసారు. ముందుగా వచ్చిన కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని పక్కన పెట్టి వెనకొచ్చిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని కావలి కన్వీనర్‌గా పెట్టడంలో ప్రధానపాత్ర మేకపాటి సోదరులదే. దీంతో విష్ణువర్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి జర్నయ్యాడు. దీనివల్ల వైయస్సార్ కాంగ్రెస్‌లోనూ డబ్బున్న వారికే పదవులు అనే సంకేతాలు వెళ్లాయి.

తాజాగా నెల్లూరు నగర పార్టీకి కన్వీనర్‌గా ఆనం వెంకటరమణారెడ్డి నియామకం కూడా పార్టీలో తీవ్ర వివాదం రేపుతుంది. ఆనం వెంకటరమణారెడ్డి నియామకం వెనుక మేకపాటి రాజమోహన్‌రెడ్డి పాత్ర వుంది. వెంకటరమణారెడ్డిని కన్వీనర్‌గా నియమించకుంటే నెల్లూరు ఎంపీగా పోటీచేయబోనని మేకపాటి అలిగేసరికి జగన్ దిగొచ్చినట్లు తెలుస్తుంది.

పార్టీలో మేకపాటిది రాష్ట్రస్థాయి పాత్ర. కాని ఆయన జిల్లా రాజకీయాలకే పరిమితమవుతున్నాడు. ఒక కన్వీనర్ పదవి కోసం ఆయన అలగడమంటే వీళ్లెమాత్రం రాజకీయాలు చేయగలరో అర్థమవుతుంది. రాజకీయాలలో శత్రువులను పెంచుకోవడం కాదు, శత్రువులను సైతం స్నేహితులుగా మలచుకోవడం ఉత్తమ రాజకీయనాయకుల లక్షణం. మేకపాటిలో ఆ స్థాయి ఆలోచన ఉండడం లేదు. జిల్లాలో పార్టీని తమ గుప్పిట్లో వుంచుకోవాలని చూస్తున్నారు. అందుకోసం తమ ముద్రవేసుకున్న నాయకులకు పదవులు ఇప్పించుకుంటున్నారు. జగన్ ఇమేజ్‌తో ఒక ఎలక్షన్ నడుస్తుంది. మిగతా ఎలక్షన్లు నడవాలంటే పనిచేసే నాయకులు, కార్యకర్తలు వుండాలి. అలాంటి వారికి ఇలాంటి సమయంలో షాగపెడితే ఎలా అని మేకపాటి సోదరులపై వైయస్సార్ కార్యకర్తలు మండిపడుతున్నారు.

# కాలధర్మం

## 'బిట్రగుంట గోపాలరెడ్డి'



"కాంగ్రెస్ గోల్డియుడు"గా, "ఉత్తమ పంచాయితీ"గా ఎందరికో సుపరిచితుడు, ఇంటి పేరు కోర్పాటి అయినప్పటికీ, బిట్రగుంటగా ప్రసిద్ధిగాంచిన కోర్పాటి గోపాలరెడ్డి(76) మే 6వ తేదీ నిండు పూర్ణిమనాడు పరమపదించారు. గత కొంతకాలంగా వరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ 6వ తేదీ తుదిశ్వాస విడిచారు. 1936 అక్టోబర్ 1వ తేదీన జన్మించిన ఆయన తొలి నుండి కాంగ్రెస్‌వాది. యువకుడిగా వున్న రోజుల్లోనే 1959లో కాంగ్రెస్ శిక్షణాశిబిరంలో పాల్గొని గుర్తింపు పత్రాన్ని పొందిన ఘనుడాయన. కొండబిట్రగుంటలో వెలసివున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి రెండు పర్యాయాలు ఛైర్మన్‌గా, పాతబిట్రగుంటకు దాదాపు 11సంవత్సరాలు సర్పంచ్‌గా పనిచేసారు. తుదిశ్వాస విడిచే వరకూ నిబద్ధతగల కాంగ్రెస్ వాదిగానే నిలిచారు. శివశంకర్ కేంద్రమంత్రిగా వున్న సమయంలో కేంద్ర టెలికాం బోర్డు సభ్యుడిగానూ, తదుపరి నెల్లూరుజిల్లా టెలికాం బోర్డు అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగానూ తన అమూల్యమైన సేవలు అందించారు.

మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డికి సమకాలికుడిగా నెల్లూరుజిల్లా రాజకీయాలలో కీలకపాత్ర పోషించడంతో పాటుగా, కీర్తిశేషులు బెజవాడ గోపాలరెడ్డి, కలికి యానాదిరెడ్డి వంటి సీనియర్ నాయకులతో ఎనలేని సత్సంబంధాలను నెరపేవారు. ఆయనకు చదువంటే చాలా ఇష్టం. తన పిల్లలందరూ ఉన్నత చదువులు చదవడంతో స్ఫూర్తిపొందిన తన 65వ యేట మధురై కామరాజ్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా యం.ఎ. డిగ్రీని పొందడం విశేషం. గోపాలరెడ్డికి నలుగురు సంతానం. భార్య "శేషమ్మ" గ్రామంలోనే వుంటారు. కుమారుడు శ్రీధర్‌రెడ్డి అమెరికాలోని డల్లాస్‌లో వుంటున్నారు. అమెరికాలోని ఇండియా అసోసియేషన్ అధ్యక్షుడిగా అందించిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం, భారతదేశ కీర్తిప్రతిష్టలను బయటదేశంలో ఇనుమడింపజేసినందుకు గాను "హిందూరత్న" అవార్డుతో శ్రీధర్‌రెడ్డిని సత్కరించింది. సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు ప్రజానాయకుడిగా మంచి కీర్తిప్రతిష్టలు పొందిన గోపాలన్న మృతితో శోకసముద్రంలో వున్న ఆయన అభిమానులకు, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది "లాయర్".

## అలంశెట్టి పుల్లయ్య



మునిసిపల్ పుల్లయ్యగా అందరికీ సుపరిచితుడైన అలంశెట్టి పుల్లయ్య మే 7వతేది దివంగతులయ్యారు. 1934లో జన్మించిన ఆయన 1954లో సాధారణ క్లర్క్‌గా నెల్లూరు మునిసిపల్ శాఖలో చేరి, అదే శాఖలో వివిధ విభాగాలలో 38సంవత్సరాల పాటు పలు హోదాలలో పనిచేసి 1992లో రిటైరయ్యారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడి ఆయన 7వతేదిన కన్నుమూశారు. పి.సి. సుబ్బారెడ్డి హయాం నుండి ఆయనకు మునిసిపల్‌శాఖతో గట్టి అనుబంధం వుండేది. పుల్లయ్యకు భార్య, కుమారుడు వున్నారు. ఆయన కుమారుడు శ్రీధర్ టాటా టెలీసర్వీసెస్‌లో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా యావత్ భారతదేశంలో తన సేవలు అందిస్తున్నారు. తన సహోదరులను, కుటుంబసభ్యులను దుఃఖసాగరంలో ముంచి వెళ్లిపోయిన పుల్లయ్య ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు మనోస్థైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది "లాయర్".

PDF Compressor Free Version



## మహదానంద సంరంభం...

# టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆరంభం...!

లక్షమైళ్ళు దిగి భూమికి దగ్గరగా వచ్చిన చందమామకే అలంకారంగా నెల్లూరు నగరంలో మే6వ తేదీ సినీ తారలు మెరిశారు. టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ నెల్లూరుశాఖ ప్రారంభోత్సవం దాదాపు 18మంది సినీ దిగ్గజాల నడుమ, అంతకుమించిన సంఖ్యలో హాజరైన జిల్లా రాజకీయనేతల సాక్షిగా కన్నులపండువగా మహదానంద సంరంభంగా జరిగింది. ప్రతి జిల్లాలో తన లలిత కళాపరిషత్ స్థాపించాలనే లక్ష్యంతో అన్ని జిల్లాలలో ఆడిటోరియంలు నిర్మించాలనే ధ్యేయంతో కళామతల్లి సేవలో తాను "కళాభిరాముడి"గా అవతరించాలనే ఆశయంతో చేస్తున్న ప్రయాణంలో భాగంగా చేసిన మజిలీయే ఈ కార్యక్రమం. 6నెలల క్రింద ప్రకటించబడిన ఈ మహత్తర మహోత్సవాన్ని మే 6వ నెల్లూరులో నిర్వహించారు.

శ్రీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణంలో వేలాదిమంది కళాప్రియులు, కళారాధకులు, కళాకారుల సాక్షిగా జరిగిన ఈ వేడుకకు దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు గ్రహీత పద్మవిభూషణ్ డా॥ అక్కినేని నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. "నటవాచస్పతి" బిరుదును అందుకోవడానికి కలెక్షన్‌కింగ్ పద్మశ్రీ మోహన్ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేశాడు. ఇక సినీవినీలాకాశంలో తిరుగులేని తారగా మెరిసిన నెల్లూరు ఆడపడుచు, కళాభినేత్రి వాణిశ్రీ, సినీ నిర్మాణరంగంలో రారాజు, దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు గ్రహీత, టి.సుబ్బరామిరెడ్డి లలితకళా పరిషత్ అధ్యక్షులు డా॥డి.రామానాయుడు, సీనియర్ నటుడు, నిర్మాత మురళీమోహన్‌తో పాటు పరుచూరి బ్రదర్స్, పద్మశ్రీ బ్రహ్మానందం, ఆలీ, రాజశేఖర్, జీవిత, కోడి రామకృష్ణ, తనికెళ్ళ భరణిలతో సహా హీరోయిన్లు శ్రద్ధదాస్, దీక్షాసేథ్, లక్ష్మీప్రసన్న, అర్చనలు ఈ కార్యక్రమానికి ఆకర్షణగా నిలిచారు.



మోహన్‌బాబుకు 'నటవాచస్పతి' బిరుదు ప్రదానం

## దానం ధర్మం ధార్మికత నా తత్వం

**- సుబ్బరామిరెడ్డి**



కళలను ప్రేమించడం, కళారంగాన్ని ఆదరించడం, కళాకారులను సత్కరించడంతో పాటు తనకు దైవచింతన కూడా ఎక్కువని, వీటితో పాటు మానవసేవే మాధవసేవ అనే పరమార్థాన్ని కూడా తాను నమ్ముతానని, దానం, ధర్మం, ధార్మికత తనకు శ్వాసలాంటివని సుబ్బరామిరెడ్డి తన అధ్యక్షోపన్యాసంలో పేర్కొన్నాడు. తన చిన్ననాడు సైకిల్‌లో తిరిగిన నెల్లూరు నేలపై కళాపరిషత్‌ను ప్రారంభించడం దాదాపు పదికోట్ల రూపాయలతో "కళాలయాన్ని" నిర్మించబోవడం తనకు ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. ఇన్నాళ్లకు నెల్లూరు గడ్డపై తన సేవలందించే అవకాశం రావడం దైవ నిర్ణయమని అన్నారు. తమ కుటుంబంతో చిరకాల అనుబంధం వున్న మోహన్‌బాబుని 'నటవాచస్పతి' బిరుదుతో సుబ్బరామిరెడ్డి సత్కరించారు. అనంతరం శివనామస్మరణతో మోహన్‌బాబుని ఆశీర్వదించారు. సభకు విచ్చేసిన ప్రతిఒక్కరి గురించి పేరుపేరునా వివరిస్తూ కృతజ్ఞతాంజలి తెలియజేశారు.

స్వాగతోపన్యాసం చేసిన డా॥ డి.రామానాయుడు, టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ చేస్తున్న, చేసిన, చేయబోతున్న కార్యక్రమ వివరాలని తెలియజేశారు. ముందుగా పరుచూరి బ్రదర్స్‌లో ఒకరైన గోపాలకృష్ణ మాట్లాడుతూ నిండు చంద్రుడు భూమికి దగ్గరగా వచ్చినరోజే సుబ్బరాముడు నెల్లూరీయులకు చేరువగా వచ్చాడని పేర్కొంటూ మోహన్‌బాబుతోగల చిరకాల బాంధవ్యాన్ని గురించి వివరించాడు. తనికెళ్ల భరణి, బ్రహ్మానందం, ఆలీ, రాజశేఖర్, కోడి రామకృష్ణ, డా॥ మురళీమోహన్‌లు తమ ఉపన్యాసాలలో టి.యస్.ఆర్ కళారంగానికి చేస్తున్న సేవలు, కళాకారులతో ఆయనకున్న సత్సంబంధాల గురించి తెలియజేస్తూ తమ పాత జ్ఞాపకాలను, ఆయనతో తాము పంచుకున్న మధురక్షణాలను గుర్తు చేసుకున్నారు.

## ఆయన చాలా మంచోడు

## హృదయానికి హత్తుకోండి...!

**- మోహన్‌బాబు**

నటవాచస్పతి బిరుదు అందుకున్న మోహన్‌బాబు తన ప్రసంగంలో టి.యస్.ఆర్ గుణగుణాలను వివరించాడు. హృదయమున్న మంచి మనిషి, మానవతావాది, సేవాపరాయణుడు, జాలి, దయ కవచకుండలాలుగా అడిగినవారికి లేదనకుండా వరాలిచ్చే దాత ఇన్నాళ్లకు నెల్లూరుకు, నెల్లూరీయులకు దగ్గరయ్యాడని ఆయనను నెల్లూరు వదలకుండా హృదయానికి హత్తుకోవాలసిన బాధ్యత, ఆయన సేవలను వాడుకోవలసిన సమయం ఆసన్నమైందని, ఇలాంటి మంచి అవకాశం నెల్లూరీయులు వదులుకోవద్దని పిలుపునిచ్చారు. మూడు దశాబ్దాలకుపైగా సుబ్బరామరెడ్డితో తనకున్న స్నేహబంధం తన పూర్వజన్మ పుణ్యమని చెప్పారు. "నటవాచస్పతి" బిరుదుతో పాటు ఈ సత్కారాన్ని అక్కినేని, రామానాయుడు వంటి మహనీయుల చేతులమీదుగా అందుకోవడం మహద్భాగ్యంగా భావిస్తున్నానని అన్నారు. నెల్లూరుజిల్లా అల్లుడినైన 13రోజులలోనే తనకు మొదటి సినిమా అవకాశం లభించిందని, సెంటిమెంటుగా నెల్లూరంటే తనకెంతో అభిమానమని చెప్పాడు.

## నన్ను ఆవిష్కరించింది నెల్లూరీయుడే

**- అక్కినేని**



సాయంత్రం 6గంటల 30నిముషాల నుండి రాత్రి 11గంటల వరకు జరిగిన "లలిత కళాపరిషత్" ప్రారంభవేడుకలో మొదట నుండి తుది దాకా ఎంతో ఓపిగ్గా కూర్చున్న అక్కినేని మాట్లాడిన ప్రతిమాటా వజ్రాల మూటగా పేర్కొనవచ్చు. ఈనాడు తనని ఇంతమంది ఇన్ని రకాలుగా ప్రశంసిస్తున్నారంటే, తాను 75సంవత్సరాలుగా తెలుగు సినీ వినీలాకాశంలో వెలుగుతున్నానంటే అందుకు కారణం తనకు తొలిసారిగా అవకాశమిచ్చిన నెల్లూరువాసి ఘంటసాల బలరామయ్యేనని అన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా సుబ్బరామిరెడ్డిని అతి దగ్గరగా గమనిస్తున్నానని, ఆయన జీవితంలోని అన్ని దశలు తనకు తెలుసన్నారు. ఆయనది విశిష్ట గుణమని, శత్రువుని సైతం దగ్గరకు తీసుకోవడం, తనను సహాయం అడిగిన వారిని అసంతృప్తి పరచకుండా ఆదుకోవడం, అన్నింటినీ మించి కళారంగానికి అత్యంత ప్రాముఖ్యతనిచ్చి సేవ రంగంతో సమానంగా కళాకారులను సత్కరించడం ఆయనలోని ప్రత్యేక గుణమని కొనియాడారు. తనకు నటుడిగా జన్మనిచ్చిన నెల్లూరీయుడి గడ్డలో పుట్టిన మరో నెల్లూరీయుడు తనకంటే 20సంవత్సరాలు చిన్నవాడైనప్పటికీ తనకు మంచి ఆప్తుడుగా, మిత్రుడుగా వుండడం గొప్ప విశేషమని చెప్పారు. మోహన్‌బాబుని చూస్తే నటుడిగా చాలా సంతోషమేస్తుందని, విద్యారంగానికి మోహన్‌బాబు చేస్తున్న సేవ చూస్తే ఈర్ష్య కలుగుతుందని అంటూ, "నిన్ను చూసి వేరొకరు ఈర్ష్య పడుతున్నారని బాధ పడవద్దు, ఎదుటివాళ్లు ఈర్ష్య పడేస్థాయికి నువ్వెదిగినందుకు సంతోషపడు" అంటూ హితబోధ చేశారు. ఈ సూక్తి అందరికీ వర్తిస్తుందని, ఎవ్వరు కూడా తమను చూసి ఇంకొకరు కుళ్ళుకుంటున్నారని బాధపడాల్సిన అవసరమేలేదన్నారు. వేరొకరు ఈర్ష్యించుకునే స్థాయికి మన మెదిగినందుకు గర్వపడాలని సూచించారు. అందరు తన వయసు ప్రస్తావిస్తున్నారని, తనకు తల తెల్లబడిందే కాని, మనసు తెల్లబడలేదని, ఇప్పుడైనా వాణిశ్రీ ఒప్పుకుంటే "ఎట్టాగో వున్నాది ఓలమ్మీ" అని ఈ వేదికపైనే చిందులేయాలని వుందని చెప్పి తనలోని చాతుర్యాన్ని మరోసారి ప్రదర్శించారు.

దాదాపు ఆరు గంటల పాటు జరిగిన ఈ సాంస్కృతిక సంబరానికి ప్రజలు వేలాదిగా తరలిరావడమే కాకుండా కార్యక్రమం ఆసాంతం ఆసక్తిగా తిలకించారు. ఇంత మంది సినీప్రముఖులను రాజకీయ నాయకులను ఒక వేదికకు చేర్చడం ఒక్క సుబ్బరామిరెడ్డికే సాధ్యమన్న మాట సభకు వచ్చిన వారందరి నోటా వినపడడం విశేషం.



## నెల్లూరంటే... నెల్లూరే!

**- వాణిశ్రీ**

కళాభినేత్రి, నెల్లూరు కళామతల్లి ముద్దుబిడ్డ వాణిశ్రీ మాట్లాడుతూ తనకు నెల్లూరుకు రావాలన్నా, నెల్లూరులో మాట్లాడాలన్నా చాలా ఇష్టమన్నారు. నెల్లూరంటే రవ్వ, నెల్లూరంటే దూకుడు, నెల్లూరంటే రగడ అంటూ నెల్లూరంటే నెల్లూరేనని, నాకిష్టమైన నెల్లూరులో అక్కినేనితో కలసి ఈ సంబరాలలో పాల్గొనడం చాలా ఆనందంగా వుందని అన్నారు.



తమ గానామృతంతో ఆహూతులను ఉర్రూతలూగించిన చక్రి బృందం

కార్యక్రమానికి భారీగా హాజరైన అభిమాన జనసంద్రం



## మేషం

ఆర్థికంగా బలపడి, వ్యాపారవృద్ధికి చేసే కృషి ఫలించి ఆదాయం పెరుగుతుంది. వృత్తిపరంగా తీరికలేనంత పని ఉంటుంది. సమయానుకూల ప్రవర్తన తెలివితేటలతో పనులు జరుపుకొంటారు. ఉద్యోగులకు పైఅధికారుల అభిమానం ఉంటుంది. పోటీ పరీక్షలను విజయవంతంగా పూర్తిచేస్తారు. గృహోపకరణ, కొత్త వస్తువులు సమకూర్చుకొంటారు.

అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

## వృషభం

ఆర్థికసంపద, వసతులు, పెట్టుబడులను గూర్చిన ఆలోచనలు ఎక్కువగా ఉంటాయి. వృత్తివ్యాపారాలలో సామాన్యఆదాయం ఉంటుంది. ఖర్చులు తగ్గించుకొనే ప్రయత్నాలు జరపాలి. బంధువర్గంతో విభేదాలుండ గలవు. బంధువర్గంలో అనారోగ్య వార్తలువినడం, హఠాత్తుగా ప్రయాణాలు చేయడం జరుగుతుంది. కొందరు బంధుమిత్ర వర్గంలో పార్టీకి సహాయపడతారు.

కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర 1, 2 పాదాలు

## మిథునం

అర్థరహితమైన నిర్ణయాలు, స్థిరాస్తుల లావాదేవీలలో తొందరపడవద్దు. వృత్తివ్యాపారాలలో ఆదాయం సంతృప్తిగా ఉండినా ఖర్చులు కూడా అదేస్థాయిలో ఉంటాయి. పిల్లల విద్యా, వివాహ విషయాలలో మధనపడతారు. చేపట్టిన పనులు నిదానంగా సాగడంతో చిన్నచిన్న ఉంటుంది. షేర్లు పెట్టుబడిరంగాలు అసంతృప్తి కలిగిస్తాయి. వ్యాపార అవకాశాలు కొన్ని చేజారిపోవచ్చును.

మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

## కర్కాటకం

ఆర్థికప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కొత్త పథకాలలో వృత్తివ్యాపారాలలో ముందుకు సాగుతారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. క్షేత్రస్థలాలు, స్థిరాస్తుల లావాదేవీలకు అవకాశాలు దొరుకుతాయి. రావలసిన బాకీల వసూలుపై దృష్టి పెంచుతారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత. క్షేత్రసందర్శన వృత్తి ఉద్యోగ నిర్వహణలో భిన్నతేడాలు జరిగే అవకాశం ఉన్నది.

పునర్వసు 4 పాదం, పుష్యమి, ఆశ్లేష

## సింహం

ఆర్థికంగా సాహసనిర్ణయాలు చేసి మేలుపొందుతారు. వృత్తిపరంగా తీరిక ఉండదు. వ్యాపారవర్గాలకు ఆదాయము సామాన్యంగా ఉంటుంది, అయితే భవిష్యత్తులో అభివృద్ధికి అవకాశాలు అందుకుంటారు. కుటుంబ సభ్యుల ద్వారా ముఖ్య విషయాలు చర్చకు వస్తాయి. గృహోపకరణాలు కొంటారు. పెట్టుబడులపై ఆదాయం పెరుగుతుంది. అనుకోని స్వల్ప ఆదాయముంటుంది.

మఖ, పుబ్బ, ఉత్తర 1 పాదము

## కన్య

వృత్తి ఉద్యోగ నిర్వహణలో శ్రమ ఇబ్బందులుంటాయి. వ్యాపారవర్గాలకు ఆర్థికావకాశాలు చేజారిపోవచ్చును. బంధువులు సహచరుల నుండి విమర్శలు ఎదుర్కొనవలసి ఉంటుంది. అనవసరపు అప్పులు చేయక తప్పని పరిస్థితి, కోర్టు వ్యవహారాలు వాయిదాపడటం, ప్రభుత్వ కార్యాలయాలలో పనులు జరగకపోవడం ఉంటుంది. ఆత్మీయులకు అనారోగ్య బాధలుంటాయి.

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

## రాశి - మీ వాసి

తేది 11.05.2012 నుండి
తేది 17.05.2012 వరకు.

ఈ వారం మేషంలో రవిబుధగురువులు. తేది 14 వృషభంలో రవి మరియు తేది 17 వృషభంలో గురువు, వృషభంలో కేతుశుక్రులు, సింహంలో కుజ, తులలో శని, తేది 15 నుండి కన్యలో శని, వృశ్చికంలో రాహువు. మకర కుంభమీనరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

### పంచాంగము:

గురుమౌఢ్యమి జరుగుచున్నది.

తేది 11 శుక్రవారము విజరర్తరి ప్రారంభము.

తేది 15 మంగళవారం హనుమజ్జయంతి.

తేది 17 గురువారం కర్మదానది పుష్కరాలు ప్రారంభం.

### వైశాఖమాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 11 | శుక్ర | షష్ఠి | రా॥గం.9.20ని॥ |
| తేది. 12 | శని | సప్తమి | రా॥గం.8.13ని॥ |
| తేది. 13 | ఆది | అష్టమి | రా॥గం.7.42ని॥ |
| తేది. 14 | సోమ | నవమి | రా॥గం.7.37ని॥ |
| తేది. 15 | మంగళ | దశమి | రా॥గం.8.04ని॥ |
| తేది. 16 | బుధ | ఏకాదశి | రా॥గం.8.59ని॥ |
| తేది. 17 | గురు | ద్వాదశి | రా॥గం.10.20ని॥ |

## తుల

కొన్ని ముఖ్య విషయాలందు నిర్ణయాలు చేయలేక ఆందోళన చెందుతారు. వృత్తి, ఉద్యోగ నిర్వహణలో చిన్నచిన్న ఇబ్బందులు ఎదురుకాగలవు. వ్యాపారవర్గాలకు లావాదేవీలు సామాన్యంగా ఉండి ఆశించిన ఆదాయం ఉండదు. అనుకున్న పనులకు ఆటంకాలుండగలవు. పెట్టుబడులు షేర్లపై ఆదాయము అసంతృప్తి కలిగిస్తుంది. క్రొత్త ఆర్థికావకాశాలు వెనుకబడగలవు.

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

## వృశ్చికం

ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగ్గ ఫలితం ఉండదు. వ్యాపార భాగస్వామ్య అవకాశాలు, పెట్టుబడి అనుకూలాలు చేజారిపోగలవు. గతించిన విషయాలపై ఆరోపణలు, కోర్టు కేసులు ప్రారంభంకావచ్చును. బంధుముఖ్యులందు అనారోగ్య బాధలుంటాయి. కుటుంబంలో సహకారంలోపించి చికాకు కలిగించవచ్చు. ఆరోగ్యం బాగుంటుంది.

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

## ధనుస్సు

వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. వ్యాపారవృద్ధి పథకాలు ప్రణాళిక ఏర్పాటుచేసి చర్చించగలరు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు కొద్దిరోజులు వాయిదావేసు కొనడం మంచిది. షేర్లు పెట్టుబడుల మీద ఆశించినస్థాయిలో లాభాలుండవు. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగార్థుల కృషి ఫలించేస్థితి ఉన్నది. వస్త్ర, వాహన, గృహాలపేర్లు చేపట్టగలరు.

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

## మకరం

ఆర్థికవ్యవహారాలలో ఒప్పందాలలో సముచిత నిర్ణయాలు తీసుకొంటారు. వృత్తిపరంగా విశ్రాంతి ఉండదు. వ్యాపారంలో అభివృద్ధి ఆదాయము పెరుగుతుంది. వాహనాలు నడిపేటప్పుడు, కరెంటు యంత్రాలు పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. ఉద్యోగులకు అధికారుల సహకారం, సహచరుల ప్రశంసలు లభిస్తాయి. పోటీపరీక్షలు బాగా వ్రాయగలరు.

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

## కుంభం

పెద్దల విద్యాభివృద్ధి, వివాహప్రయత్నాలపై దృష్టిపెడతారు. కోర్టువ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలు కొంత మేరకు వసూలుకాగలవు. నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల మీపై విమర్శలు వస్తాయి. వృత్తివ్యాపారవర్గాలకు ఆదాయం పెరుగుతుంది. బంధువుల రాకపోకలు, ప్రముఖులను కలుసుకోవడం జరుగుతుంది. ఎవరికి హామీలు ఋణాలు ఇవ్వకండి.

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1, 2, 3 పాదాలు.

## మీనం

వ్యవహారాలలో విజయం, అనుకున్న పనులు సక్రమంగా జరగడం ఉంటుంది. వాణిజ్యపరంగా క్రొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాలు లభిస్తాయి. వృత్తివ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. నిర్మాణాలకు, ఇతర ఆర్థికావసరాలకు ఋణాలు చేయవలసిరావచ్చును. రావలసినబాకీలు వాయిదాపడగలవు. ఆరోగ్యలోపం స్వల్పంగా బాధిస్తుంది. బంధువర్గానికి ఆత్మీయులకు సహాయపడతారు.

పూ.భాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిపించండి

*- ఆశ కార్యకర్తలకు పిలుపు*

ఆశ కార్యకర్తలు కనీసం నెలకు ఒక ప్రసవం అన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చూడాలని, అలాకాని పక్షంలో అందుకు తగిన కారణమైనా తెలపాలన్నారు వెంకటగిరి మండలం, బంగారుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ జిలానీ. వెంకటగిరి ఘోషాసుపత్రిలో 7వ తేదీ ఆశ కార్యకర్తలు, వైద్యసూపర్‌వైజర్లతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

పాఠశాల విద్యార్థులకు హెల్త్ ప్రాజెక్టు నిర్వహించాలన్నారు. ప్రతి గురువారం విద్యార్థులకు వారి పాఠశాలల్లోనే వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని కోరారు. 108 వాహనాలనుపయోగించి గ్రామాలలోని గర్భిణులను ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు జరిపించేందుకు తగిన విధంగా నచ్చజెప్పాలని సూచించారు. ప్రసవం తర్వాత శిశు సంరక్షణ కార్యక్రమం ద్వారా 150 రూపాయలు, భోజన సదుపాయానికి రోజుకు 50 రూపాయలు, మందులకు 60రూపాయలు, అందించాల్సిందిగా ఆశ కార్యకర్తలకు ఆయన ఆదేశాలు జారీచేశారు. అలాగే జననీ సురక్షయోజన కార్యక్రమం క్రింద గర్భిణులకు 700రూపాయలు నగదు అందించాల్సిందిగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మహాలక్ష్మి, సర్వలక్ష్మి, వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన పైపులైన్ నిర్మాణ పనులు

### తాగునీటి కోసం అల్లాడుతున్న ప్రజలు

లక్షమంది జనాభా గల గూడూరు పట్టణ ప్రజలు గుక్కెడు మంచినీటి కోసం అల్లాడుతున్నారు. ఏ ప్రాంతంలో నీళ్లు వస్తాయంటే అక్కడకు మహిళలు, పురుషులు బిందెలతో పరుగులు తీస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి గూడూరు పట్టణ ప్రజల శాశ్వత దాహార్తి తీర్చడంకోసం కండలేరు నుండి గూడూరుకు పైపులైను ద్వారా నీరు తెప్పించుటకు 55కోట్ల రూపాయల నిధులు మంజూరుచేశారు. ఈ పనులను కాంట్రాక్టర్ గత ఏడాది ఆగష్టు నాటికి పూర్తి చేయాల్సి వుండగా నేటికీ నత్తనడక నడుస్తున్నాయి. దీంతో గూడూరు ప్రజలకు ఈ వేసవిలోను తాగునీటి అవస్థలు తప్పడంలేదు. ముఖ్యంగా ఈ ప్రాంతం సైనాపు ప్రసిద్ధి చెందినది కావడంతో ఎక్కడ బోరు వేసినా తాగేందుకు నీరు ఉపయోగపడదు. ప్రస్తుతం గూడూరు సమీపంలోని విందూరు, వేములపాలెం, మల్లెలోట ప్రాంతాల్లో బావులు, బోర్లు వేసి అక్కడ నుండి పైపులైన్ల ద్వారా గూడూరులోని పలు రిజర్వాయర్లకు పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత జనాభా అవసరాలకు ఆ నీరు సరిపోవడంలేదు. రోజుకు ఒక్కపూటే నీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు నీటికోసం కష్టాలు పడక తప్పడంలేదు. వచ్చే నీటికోసం బిందెలతో కొళాయిల వద్ద బారులు తీరుతున్నారు. నీళ్లకోసం నిత్యం ఏదో ఒకచోట ఘర్షణలు తలెత్తుతూనే ఉన్నాయి. గూడూరు 1,2 పట్టణ ప్రజలకు ఒకరోజు మంచినీరు వస్తే మరోరోజు సక్రమంగా రావడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరాకోసం తమ ప్రభుత్వం నిధులను మంజూరుచేసిందని చెప్పుకొంటున్న నాయకులు కూడా నీటి సరఫరా విషయంలో త్వరగా నిర్ణయం తీసుకొని సక్రమ నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకొని నీటికష్టాల నుండి గట్టెక్కించాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.


## వధువు కావలెను — పెళ్లి సంబంధాలు — వరుడు కావలెను

1. 1985 జూన్ 20 జననం. ఎత్తు 6". చదువు బి.ఇ(మెకానికల్), యం.బి.ఎ(ఐ.ఐ.యమ్) ముంబాయి. ఉద్యోగం ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకు(హైదరాబాద్). జీతం నెలకు లక్షపైన. ఆస్తిపాటు 30కోట్లు. ఉన్నతమైన రెడ్డి డాక్టర్లకుటుంబం. స్వస్థలం రాయలసీమ, ప్రస్తుత నివాసం హైదరాబాద్.
2. 1983 అక్టోబరు 16 జననం. ఎత్తు 6". చదువు బి.బి.యమ్., యం.బి.ఏ(బెంగుళూరు). వ్యాపారం రియల్‌ఎస్టేట్ మరియు కన్‌స్ట్రక్షన్స్, ఆఫ్ అపార్ట్‌మెంట్స్(బెంగుళూరు). ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తిపాటు 10కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
3. 1983 నవంబరు 23 జననం. ఎత్తు 5'11". చదువు బి.టెక్(మద్రాసు), యం.యస్(ఐటి) అమెరికా. ఉద్యోగం చికాగో (అమెరికా). జీతం 1,00కె సంవత్సరానికి. ఆస్తిపాటు 11/2కోటి. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
4. 1982 ఫిబ్రవరి 23 జననం. ఎత్తు 5'11". చదువు యం.బి.ఏ(మద్రాసు) ఉన్నతమైన రెడ్డివ్యాపారకుటుంబం. ఆస్తిపాటు 25కోట్లు. స్వస్థలం కోవూరు తాలూకా. ప్రస్తుతనివాసం మద్రాసు.
5. 1986 నవంబరు 28 జననం. ఎత్తు 5'11". చదువు బి.టెక్(ఐ.ఐ.టి) మద్రాసు, యం.బి.ఏ(ఐ.ఐ.ఎ.యమ్) బెంగుళూరు. ఉద్యోగం బెంగుళూరు. జీతం నెలకు 60,000/-. ఆస్తి విలువ 15కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
6. 1984 సెప్టెంబరు 13 జననం. ఎత్తు 5'4". చదువు బి.టెక్. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (బెంగుళూరు). జీతం నెలకు 50,000/-. ఆస్తిపాటు 50లక్షలు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం కావలి తాలూకా ప్రస్తుతనివాసం నెల్లూరు.
7. 1983 ఫిబ్రవరి 17 జననం. ఎత్తు 5'6". చదువు బి.కాం, ఇంటీరియర్ డిజైనర్. ఆస్తిపాటు 10కోట్లు. స్వస్థలం తెలంగాణా. ప్రస్తుతస్థిరనివాసం హైదరాబాద్. ఉన్నతమైన రెడ్డి రాజకీయకుటుంబం.
8. 1988 జూలై 6 జననం. ఎత్తు 5'3". చదువు బి.టెక్(ఎలక్ట్రానిక్స్), యం.యస్(టెలికమ్యూనికేషన్స్) అమెరికా. ఉద్యోగం టెక్సాస్(అమెరికా). జీతం నెలకు 6వేల డాలర్లు. ఆస్తివిలువ 10కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం.
9. 1985 మే 23 జననం. ఎత్తు 5'5". చదువు యం.బి.బియస్(అనంతపూర్), యం.డి(ఎమర్జెన్సీ మెడిసిన్). ఆస్తిపాటు 1కోటి. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
10. 1986 నవంబరు 30 జననం. ఎత్తు 5". చదువు యం.బి.బి.యస్(బెంగుళూరు). ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా. ప్రస్తుతనివాసం మద్రాసు.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, [illegible] 98480 34522 94406 39460 [illegible]

## కదంబం

# 'నటవాచస్పతి' బిరుదును తిరస్కరించిన మోహన్‌బాబు

గల్పిక

అభాగ్యులకు నివాసమైన భాగ్యనగరంలో డాక్టర్ తిక్కవరపు సుబ్బరామిరెడ్డి నివాసం. తన పూజామందిరంలో కాషాయవస్త్రం ధరించి ఏం చేయాలో అంటూ ఆయన ఓ అరగంట పాటు స్మరించాడు. ఆయన భక్తిని మెచ్చి పరమ శివుడు స్పెషల్ ఫ్లైట్‌లో హైదరాబాద్ వచ్చి సుబ్బరామిరెడ్డి ముందు నిలిచాడు. సుబ్బరామిరెడ్డి భక్తితన్మయత్వంతో... స్వామీ... పూర్వ కాలంలో మునులు గడ్డాలు, మీసాలు పెంచుకొని ఏళ్ల తరబడి తపస్సు చేస్తే గాని ప్రత్యక్షం కాని మీరు, నా అరగంట పూజకే ప్రత్యక్షమయ్యారంటే... అది నా అదృష్టం, పూర్వజన్మ సుకృతం అని అన్నాడు. దానికి శివుడు... ఆ కాలంలో అంటే వాళ్లకు పెట్టిన వసులేమి లేవు కాబట్టి సంవత్సరాల తరబడి తపస్సు చేసేవాళ్లు నాయనా... కానీ ఇది ఫాస్ట్ కాలం. పూజచేసిన అరగంటలోనే ప్రత్యక్షమవ్వకపోతే దేవుడినే మార్చేస్తున్నారు. సినిమా హీరోలు అభిమానులను పెంచుకోవడానికి పోటీపడ్డట్లు దేవుళ్లమైన మేము కూడా భక్తులను పెంచుకోవడానికి రాజకీయనాయకుల మాదిరిగా తయారు కావాల్సి వస్తుంది. ఇయినా ఇప్పుడు నన్ను నువ్వు స్మరించుకోవడానికి కారణమేంటని అడిగాడు. అప్పుడు సుబ్బరామిరెడ్డి... ఏం లేదు స్వామి. నేను కొలిసేటగా నెల్లూరు రాజకీయాలలోకి ప్రవేశించాలనుకుంటున్నాను. మీ ఆశీస్సుల కోసం ప్రార్థించాను. నెల్లూరులో ఆవసరమైనప్పుడు మీరు రావాల్సి వుంటుందన్నారు. దానికి శివుడు అదివరకు... నేను సూళ్లూరుపేటలో సత్యసాయి క్యాంప్ పెట్టుకున్నాను. నెల్లూరులో ఎందరు అదేరకంగా ఉన్నారు... ఈ సమ్మర్ హోలిడేస్ సూపర్‌గా నేను ఉన్నచోట రాను. నెల్లూరు వెళుతున్నట్లుగానే... ఆత్మకూరు ఉపఎన్నికలో కార్పొరేషన్ ముదురుదేవాలతో జాగ్రత్త అన్నాడు. అందుకు టీఎస్ఆర్... నాకు నెల్లూరు పాతదే స్వామి అని అన్నాడు. నెల్లూరు నీకు పాతదే కావచ్చు... కానీ నెల్లూరు ముదురుదేవాలకు మాత్రం నువ్వు కొత్త కదా నాయనా... అని చెప్పి మాయమయ్యాడు.

* * * * *

అది జూలై 20-4-20 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదేవాలకు ప్రసిద్ధిగాంచిన సింహపురి మహానగరం. అందులో కస్తూర్బా హాల్ ప్రాంగణం. టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ ప్రారంభోత్సవ వేడుక. పెద్దపెద్ద... వాని ముందు ప్రేక్షకుల కోసం వేసుకున్నాయి. ఇల్లు, అక్కినేని నాగేశ్వరరావు, వాణిశ్రీ, రాజశేఖర్, జీవిత, పరుచూరి వెంకటేశ్వరరావు, మురళీమోహన్, తనికెళ్ల భరణి, ఆలీ, బ్రహ్మానందం, హీరోయిన్‌లు శ్రద్ధాదాస్, దీక్షాసేథ్, అర్చన తదితర సినీతారలతో ఆ ప్రాంతం కళకళలాడసాగింది. రాజకీయరంగం నుండి చింతా మోహన్, లగడపాటి రాజగోపాల్, వి.వి.హర్షకుమార్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి... ఇంకా ఎందరెందరో వచ్చి ఆశీను లయ్యారు. అంతలో సంగీత దర్శకుడు చక్రి మైకందుకుని... మేం పాటలు పాడడం, మీరు వినడం రొటీన్... కానీ, మేం పాడుతుంటే ఇక్కడున్న హీరోయిన్‌లు, కొందరు రాజకీయ నాయకులు కలిసి ఆడుతుంటే చూడడానికి ఎంతో వెరైటీగా వుంటుంది. కాబట్టి ఇప్పుడు ఆ కార్యక్రమాలకు మీరు తిలకిస్తారని ఎనౌన్స్ చేశాడు. మొదట చక్రి బృందం బిజినెస్‌మేన్ సినిమాలో 'సారొస్తారొస్తారే...' అనే పాటను పాడగా ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి హీరోయిన్ అర్చనతో కలిసి డ్యాన్స్ చేశారు. తర్వాత చక్రి కొన్ని చిత్రపతి సినిమాలోని నీకు పంచదార పూరీలు లేవా, మైసూరు బోండాలు లేవా...' అనే పాట పాడగా మాజీ ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసులురెడ్డి హీరోయిన్ శ్రద్ధాదాస్‌తో కలిసి స్టెప్ వేయగలిపోయి ఆడియన్స్ డ్యాన్స్ చేశారు. తర్వాత మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హీరోయిన్ దీక్షాసేథ్ కలిసి 100%లవ్ సినిమాలోని 'అర్థమౌతోందా... అర్థం కానట్టున్నాదే... దీయాలో దియాలో...' అనే పాటకు డ్యాన్స్ చేశారు. టీవదరా స్టేట్ ఆఫ్ సింహపురి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(62+) రంగంలోకి దిగాడు. ఆయనకు సెలుదిక్కులా అర్థనే, దీక్షాసేథ్, శ్రద్ధాదాస్, వాణిశ్రీలు చేరారు. చక్రి బృందం పాటందుకుంది. 'దమ్ము' సినిమాలో... 'ఉత్తరం ఊపుమీదుందే... దక్షిణం దంచికొట్టిందే... తూర్పు తుప్పురేపిందే... పడమర పడగలేసే పైకి పైకి దూసుకుందే...' అనే పాటకు డ్యాన్స్ ఇరగదీసాడు. సాంస్కృతిక కార్యక్రమాలు ముగిసాయి. టి.సుబ్బరామిరెడ్డి మైక్ తీసుకుని... గుంటూరులో మోహన్‌బాబును 'నట వాచస్పతి' బిరుదుతో సత్కరించుకున్నట్లు ప్రకటించాడు. వెంటనే మోహన్‌బాబు టీఎస్ఆర్ వద్ద నుండి మైకు లాక్కున్నాడు. ఆయన కళ్లనుండి నీళ్లు రాలుతున్నాయి. నన్ను క్షమించండి... నేను ఈ బిరుదును అర్హుడిని కాను... నన్ను మించిన మహానటుడు ఇక్కడే వున్నాడు... అని అన్నాడు. ఆ మాట వినగానే అందరూ అక్కినేని నాగేశ్వరరావు వైపు చూడసాగారు. అక్కినేని కూడా అదే ఫీలింగ్‌కు వచ్చాడు. మోహన్‌బాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... నేను రాత్రి నిద్రపోయాక నా దైవం ఎన్టీఆర్ కలలోకి వచ్చారు. ఆ దైవంతో వచ్చావేంటి అని ఆయనను అడిగాను. రేపు ఎక్కడికి వెళుతున్నావని ఆయన అడిగారు. సుబ్బరామిరెడ్డి 'నట వాచస్పతి' బిరుదు ఇస్తానన్నారు. దానిని అందుకోవడానికి పోతున్నానని చెప్పాను. అంతే... ఆయన ఆగ్రహంతో... నువ్వు నటులలో ఏం పొడిచావని ఆ బిరుదు తీసుకుంటున్నావు. అసలా బిరుదుకు నువ్వు అర్హుడివేనా? ఒకటికి పది బొక్కలు తీసుకుంటున్నావు... ఒకసారైనా... డైరెక్టర్ చేసి చూపిస్తే గానీ నటించలేవు... నువ్వు ఒక నటుడివేనా... నీకంటే నటనేనా? నటుడంటే ఎలా వుండాలి... ఎలా నటించాలి... అని సంధించిన ప్రశ్నలకు ఆయన నాకు చూపించారు. స్టేజ్‌కు తగ్గట్టు ఆయన నటిస్తారు. మనుషులను బట్టి అప్పటికప్పుడు డైలాగులు పలుకుతారు... టాలెంట్ అంటే అది. ఆయన సినిమాల్లోకి వచ్చి వుంటే మేమంతా ఆయనకు ఫస్ట్ నుండి కౌండమీడకు టాక్సీలు నడుపుకోవాల్సి వచ్చేది. అని చెప్పాడు. ఇంతకీ ఎవరా మహానటుడు అని ప్రేక్షకుల్లో నుండి ఓ వ్యక్తి ప్రశ్నించాడు. అప్పుడు మోహన్‌బాబు... ఇంకెవరు మీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి. మేం షూటింగ్‌లలో మాత్రమే నటిస్తుంటాం... కానీ ఆయన జీవితమంతా నటిస్తుంటాడు... నటిస్తూనే వుంటాడు... అని చెప్పాడు. అంతలో సభలో నుండి మరో ప్రేక్షకుడు... ఆయనకు అంతటిస్తుందా? అని వెటకారంగా అడిగాడు. అప్పుడు మోహన్‌బాబు కోపంతో... అరె ఇస్తే... ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు మాట్లాడని దీ... అనే మొదటి నాయకుడు అని... విమర్శలు చేస్తున్నారు... వివేకా అంటే... ఒక ఎన్టీఆర్, ఒక జీవిత, ఒక ఎఎన్ఆర్... ఒక శోభన్, ముగ్గురు చిరంజీవులు, నలుగురు రజినీకాంత్‌లు, ఐదుగురు మెగాస్టార్ చిరంజీవిలు, ఆరుగురు కమలహాసన్‌లు, ఏడుగురు మమ్ముట్టీలు, 8 మంది సూపర్‌స్టార్ కృష్ణలు కలిసినంత మహానటుడు... అని చెప్పాడు. ఇంతలో ... మోహన్‌బాబు... ఈ బిరుదు ఇవ్వాలనుకుంటే టీఎస్ఆర్ ... ఆయనకు ఇవ్వండి. వేడుకుంటున్నాను. టీఎస్ఆర్ కూడా ... ఆలోచనలో... ... చేసారు. ప్రతినిధి... ... నటనలో... రాజకీయ నాయకుడి కోణంలోనే చూసానని... ఆయన లోని నటనాప్రతిభను గుర్తించలేకపోయాను. దీనితో ... పొరపాటును సరిదిద్దుకుంటున్నాను... అంటూ అందరి సమక్షంలో వివేకాకు 'నట వాచస్పతి' బిరుదును ప్రదానం చేశారు.

* * * * *

## మెలుకువలో కొన్ని కలలు

- పలమనేరు బాలాజీ
పలమనేరు. 94409 95010.

మనవి కాని పీడలు,
మాటలు-
పాటలు..

బ్రతకటం ఇష్టంకాదని
అనుకోసినంత సులభంగానే
తెలిసిపోతుంది.

బట్టలు మార్చినంత సులభంగానే
ఇంట్లోనలా-బయటా
మార్పు మామూలే.

ఎవర్నో చూస్తేనో
మరెవర్నో తాకితేనో
వేరెవరి నవ్వో వినబడితేనో
మనసు ఉల్లిపడుతుంది.
ఉస్సట్లుండి
మరచిపోయిన ప్రేమేకటి
హఠాత్తుగా జ్ఞాపకానికొస్తుంది
ప్రేమించబడిన సమయాలన్నీ..
మెలకువలోని కలలే..
మెలకువలన్నీ
నిజంగా కలలే!

## గూడూరు డివిజన్ వార్తలు

# రౌడీషీటర్లు మంచిమార్గంలో పయనించాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ సురేష్‌కుమార్, హాజరైన రౌడీషీటర్లు.

రౌడీలుగా ముద్రపడినవారు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని సత్ప్రవర్తనతో మెలిగి తమపై ఉన్న రౌడీ అనే ముద్రను తొలగించుకోవాలని గూడూరు డీఎస్పీ కె.సురేష్‌కుమార్ రౌడీషీటర్లను కోరారు. 6వ తేదీ గూడూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో డివిజన్‌లోని అన్ని మండలాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదై వున్న రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో గూడూరు పట్టణంలో రౌడీల సంఖ్య పెరిగిపోయిందని, దీని నివారణకు పోలీస్‌పరంగా అన్ని రకాల చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు. డివిజన్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుండి అనేక మంది వలస కార్మికులు ఉపాధికోసం ఈ ప్రాంతానికి వచ్చి అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, ఆయా పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు తప్పనిసరిగా కంపెనీ యాజమాన్యం గుర్తింపుకార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. అలాగే గతంలో తెలిసీ తెలియక చేసిన తప్పులకు రౌడీలుగా ముద్రపడిన వారు ఇప్పటికైనా తమ తప్పులను తెలుసుకొని మంచిగా మసలుకొని రౌడీముద్రను చెరిపేసేందుకు కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో టౌన్ సి.ఐ ఉప్పాల సత్యనారాయణ, ... సి.ఐ ... , ... సి.ఐ హనుమంతరావు, వాకాడు సి.ఐ శ్రీనివాసరావుతో పాటు పలువురు ఎస్.ఐలు పాల్గొన్నారు.

## సబ్‌కలెక్టర్ కార్యాలయంలో...

# దాహం...దాహం

### తాగునీటి కోసం ప్రజల అవస్థలు

గూడూరు డివిజన్ కేంద్రమైన గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో తాగునీటికోసం ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంగణంలో ఒక బోరు, ఒక మంచినీటి కొళాయి ఉన్నా నిరుపయోగంగా వున్నాయి. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి డివిజన్‌లోని పదహారు మండలాల నుండి ప్రతినిత్యం వివిధ పనుల మీద వచ్చే జనాలకు ఇక్కడ తాగునీరు లభ్యంకాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంగణంలో ఏటువంటి దుకాణంలేకపోవడంతో వేసవి కారణంగా దాహార్తి తీర్చుకొనేందుకు వెలుపలకు వెళ్లి వాటర్ ప్యాకెట్లను, వాటర్ బాటిల్స్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా వచ్చిన ప్రజలకు ఇక్కడ కూర్చునేందుకు కూడా సరైన వసతి సౌకర్యాలు లేకపోవడం వల్ల తమ పనుల కోసం సబ్ కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చే ప్రజలు ఆయన వచ్చేంత వరకు చెట్లకిందే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. మండు వేసవిలో ఈ ప్రాంగణంలో దాహార్తి తీర్చుకొనేందుకు మంచినీరు లభ్యంకాకపోవడంతో ప్రజలు తాగునీటికోసం ఇక్కట్లు పడుతున్నారు. గూడూరు పురపాలక సంఘానికి ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న సబ్‌కలెక్టర్ ఈ ప్రాంగణంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉన్న కొళాయిలను మరమ్మత్తులు చేయించాలని డివిజన్ ప్రజానీకం కోరుతోంది.

## బూట్ల ఫ్యాక్టరీలో

# మాయమైన నోట్లు

చిల్లకూరు మండలంలోని రైల్వే స్టేషన్ వద్ద వున్న అపాలీ బూట్ల పరిశ్రమలో 4లక్షల రూపాయల నగదు మాయమైనట్లు ఆ ఫ్యాక్టరీ ప్రతినిధులు మంగళవారం చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిబ్బందికి జీతాలు చెల్లించేందుకు బ్యాంకు నుండి 20లక్షల రూపాయలు డ్రాచేసి బీరువాలో పెట్టామని, సాయంత్రం వచ్చి చూసుకుంటే అందులో 4లక్షల రూపాయలు తగ్గాయని పరిశ్రమ ప్రతినిధులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై చిల్లకూరు ఎస్సై దశరథరామారావు విచారణ జరుపుతున్నారు.

# రెఫరల్ వైద్య విధానం అవసరం

ప్రొఫెసర్ కె.శ్రీనాథ్‌రెడ్డి





ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి ప్రాంతీయ వైద్యాలయాలకు, అక్కడ నుండి జిల్లా వైద్యశాలలకు వ్యాధిపీడితులను పంపే రెఫరల్ వైద్య విధానాన్ని దేశంలో కొనసాగించాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించి బలోపేతం చేయాలన్నారు ప్రొఫసర్ కె.శ్రీనాథ్‌రెడ్డి. 12వ పంచవర్ష ప్రణాళికలో భాగంగా వైద్యరంగ పరంగా 'అందరికి ఆరోగ్యం' పై కేంద్రానికి ఆయన ఒక నివేదికను సమర్పించారు. సమర్పించటమే కాకుండా ప్రధానమంత్రిని ఈ విషయంలో ఒప్పించడం కూడా జరిగిందని తెలుస్తోంది. ఆయన కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ సందర్భంగా హైద్రాబాద్‌లో 5వ తేదీన జరిగిన ఒక సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రొఫెసర్ శ్రీనాథ్‌రెడ్డి ప్రసంగ విశేషాలు 'లాయర్' పాఠకుల కోసం...

జిల్లా వైద్యశాలల్లో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ విభాగాలను అభివృద్ధిచేసి నాణ్యమైన వైద్యసేవలను ప్రజలకు అందించాలి. దేశంలో గ్రామాలలో నివసించే వారిలో 28శాతం మందికి, ఇప్పటికీ వైద్యం అందుబాటులో లేదు 40శాతం మంది ఆస్తులమ్ముకుని చికిత్స చేయించుకుంటూ అప్పుల బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య వ్యవస్థను వ్యవస్థీకరించి బలోపేతం చేయకుండా, ప్రభుత్వం ఎన్ని రకాల పథకాలు ప్రవేశపెట్టినా ఆశించిన స్థాయిలో ప్రయోజనాలుండవు. ప్రజలు అనారోగ్యం పాలవడానికి ముఖ్యకారకాలైన మంచి నీరు, పారిశుధ్యం, పౌష్టికాహారం, విద్య, పరిసరాల పరిరక్షణల పట్ల ప్రభుత్వం తీవ్రంగా స్పందించాల్సిన అవసరం ఉంది. చికిత్సకంటే పరీక్షలు, మందుల ఖర్చే ప్రజలకు భారమౌతుంది. ప్రభుత్వమే జనరిక్ మందులు కొనుగోలు చేయటం ఓ మంచి పద్ధతి...

అందరికీ ఆరోగ్యం కోసం వైద్యబీమా ఒక్కటే ఎప్పటికీ పరిష్కారంకాదు. వైద్యరంగంలో చికిత్సకంటే బీమా కీలకంగా మారితే వైద్యవ్యయం భారీగా పెరిగిపోతుంది. వివిధ మంత్రిత్వశాఖల క్రింద ప్రజలకు కనీస అవగాహన లేకుండా అమలవుతున్న వైద్య బీమా పథకాలనన్నింటినీ ఒకే గొడుగు క్రిందకు తీసుకురావాలి. అలాగే ప్రైవేటు వైద్యశాలల సేవలకై వసూలుచేసే డబ్బుపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. వైద్యరంగం కోసం స్థూల జాతీయ ఉత్పత్తిలో 2.5శాతం నిధులు కేటాయిస్తే అందులో 0.5శాతం నిధులను మందులకోసం వినియోగించటం ద్వారా వివిధ అస్వస్థతల బారినపడుతున్న వారికి ఉచితంగా మందులు అందించేందుకు వీలవుతుంది. వీటినన్నింటినీ అమలు చేసేందుకు ప్రజల భాగస్వామ్యంతో పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటుచేయాలి. ఇవన్నీ నివేదికలో పొందుపరచాం. ప్రాథమిక, స్పెషాలిటీ సేవలను ప్రజలందరికీ ఉచితంగా అందించే విధంగా చర్యలు తీసుకుంటూ దశలవారీగా సూపర్ స్పెషాలిటీ సేవలను కూడా అందించాలని సూచించాము. ఆరోగ్య ఉపకేంద్రాలలో ప్రస్తుతం వున్న సిబ్బంది చాలరు. ఇంతకు రెట్టింపు సిబ్బంది అవసరం. వైద్యుల కొరత కూడా అధికంగానే వుంది. వీటినన్నింటినీ దృష్టిలో పెట్టుకొని మూడుసంవత్సరాల వైద్యకోర్సులను ప్రవేశపెట్టడం, వారి ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని వైద్య ఉపకేంద్రాలలో సేవలందించటం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని నివేదికలో తెలిపాం.

ప్రొఫెసర్ కె.శ్రీనాథ్‌రెడ్డి నెల్లూరీయుడు, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కార్డియాలజిస్ట్. ఈయన దేశానికి వైద్యసేవలందించేందుకు ఉద్యుక్తుడయ్యాడు. వేచిచూడకుండా పని చేసుకుంటూ, పనిచేస్తూ వెళ్లే వ్యక్తి. ఈయన నివేదికలో 60శాతం చిత్తశుద్ధితో అమలయినా భారతదేశంలో చికిత్స అందక మృతిచెందే వారి శాతం జీరోగా ఉంటుంది. "హేట్సాప్ టు శ్రీ శ్రీనాథ్‌రెడ్డి".

## 'దేశం'లో...
# దారికొచ్చిన గొడవలు

- త్రిసభ్య కమిటీ అధ్యక్షుడుగా రమేష్‌రెడ్డి
- ప్రస్తుతానికి సద్దుమణిగిన తమ్ముళ్ల తకరారు






నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల పరిధిలో తెలుగుదేశంపార్టీ పరంగా నెలకొన్న వర్గవిభేదాలు దారినపడ్డట్లుగా తెలుస్తుంది. ఎన్నికల సమయంలో ఇవి మరీ వీధికెక్కితే బాగుండదనే ఉద్దేశ్యంతో చంద్రబాబునాయుడే స్వయంగా జోక్యం చేసుకుని తెలుగుతమ్ముళ్ల మధ్య విభేదాలకు ఫుల్‌స్టాప్ పెట్టినట్లు సమాచారం.

జిల్లాలో పలుచోట్ల తెలుగుదేశంకు నాయకత్వలోపం పెద్దశాపంగా వుంది. నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, ఆత్మకూరు నియోజకవర్గాలు ఆ జాబితాలో వుండేవి. గతంలో ఆత్మకూరు నియోజకవర్గానికి తనతోపాటు గూటూరు కన్నబాబు, రాపూరు సుందరరామిరెడ్డిలతో కలిపి త్రిసభ్య కమిటీని వేయడంతో మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు అగ్గిమీద గుగ్గిలమై చంద్రబాబు ముఖాన్నే ఆయన్ని తిట్టి, పార్టీ నుండి బయటకొచ్చేయడం జరిగింది. దీంతో ఇప్పుడు ఆత్మకూరుకు కన్నబాబునే ఇన్‌ఛార్జ్‌ను చేసేసారు.

నెల్లూరు రూరల్‌కు వచ్చేసరికి చిరమన శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి ఆనంద్‌రెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు మరో ఇద్దరితో కలిసి కమిటీ వేసారు. ప్రత్యేకంగా ఒకరికంటూ నియోజకవర్గ బాధ్యతలను అప్పగించలేదు.

కాని నెల్లూరు నగరం ఇన్‌ఛార్జ్ విషయం వచ్చేసరికి మడతపేచీ పడింది. గతంలోనే నెల్లూరుకు టి.రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేశాయిశెట్టి హనుమంతురావులతో కలిసి త్రిసభ్య కమిటీని వేసారు. అయితే మాజీమంత్రి రమేష్‌రెడ్డికి ఇది రుచించలేదు. నెల్లూరు నగరానికి గాని, రూరల్‌కు గాని తనను ఇన్‌ఛార్జ్‌గా నియమించాలని కోరుతూ వచ్చారు. చంద్రబాబుపై ఈమేరకు యువరత్న బాలకృష్ణ ద్వారా ఒత్తిడితెచ్చినట్లు తెలుస్తుంది. అయితే రమేష్‌రెడ్డికి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడానికి చంద్రబాబు మనసు అంగీకరించలేదు. రమ్మి మీద చంద్రబాబుకు సదభిప్రాయం లేదు. 1999, 2004 ఎన్నికలలో కావాలనే నెల్లూరు సీటును పొత్తులో భాగంగా బీజేపీకి వదిలేసి రమేష్‌కు ఎగ్గొట్టాడు. 2009 ఎన్నికలలో బాలకృష్ణ బలవంతం వల్ల రమేష్‌రెడ్డికి నెల్లూరు నగరం సీటొచ్చింది. అయితే ఆ ఎన్నికలలో ఆయన మూడోస్థానానికి దిగజారడంతో చంద్రబాబుకు ఆయన చులకనయ్యాడు. అందుకే ఆయనతోపాటు మరో ఇద్దరిని కలిపి నగరానికి త్రిసభ్య కమిటీని వేసారు. కాని గుంపులో గోవిందలా కాకుండా తనకు ప్రత్యేక గుర్తింపు కావాలని రమేష్ కోరడంతో ఆ త్రిసభ్య కమిటీకి ఆయన్నే అధ్యక్షుడిని చేసి పంపారు. దీంతో గొడవలు ఒక దారికొచ్చినట్లయ్యింది.

# సేవాదృక్పథం పెంచాలి




సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, వేదికపై ఉమాశ్రీధర్, జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్, డిఎంహెచ్‌ఓ డా॥ మాశిలామణి, వాణి, తుంగా శివప్రసాద్‌రెడ్డి

ప్రజలలో సేవాదృక్పథం పెంపొందించేలా రెడ్‌క్రాస్ సేవలను విస్తరించాల్సి వుందని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ అభిప్రాయపడ్డారు. మంగళవారం రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జాన్ హెన్రీడునాంట్ జయంతి సందర్భంగా నెల్లూరు రెడ్‌క్రాస్ ఆడిటోరియంలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ వివిధ వృత్తులలో వుంటూ ఎంతో మంది రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా సమాజానికి తమ సేవలు అందిస్తున్నారన్నారు. జిల్లాలో 20 ఏళ్ల నుండి రెడ్‌క్రాస్ తన సేవలందిస్తుందన్నారు. జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్‌ల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసి వాటిలో వారికి భాగస్వామ్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్, రెడ్‌క్రాస్ ఛైర్‌పర్సన్ ఉమాశ్రీధర్, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాశిలామణి, రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి కన్వీనర్ తుంగా శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ కె.పద్మావతి, వికలాంగుల సంక్షేమశాఖ ఏ.డి వాణి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# కావలి కాంగ్రెస్... కంపుకంపు!

- విష్ణువర్గీయుల వీరంగం
- మంత్రి ఆనం ఆగ్రహం



గొడవ చేస్తున్న కావలి కాంగ్రెస్ కార్యకర్తలు

కావలి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా వుంది. అదే సమయంలో కుమ్ములాటలు మాత్రం బలంగా వున్నాయి. ఇక్కడ కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలకు సోమవారం కావలి సమీపంలోని ముసునూరులో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం వేదికగా మారింది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలోనే వర్గవిభేదాలు బహిర్గతమయ్యాయి.

సమావేశం మొదలుకాగానే కావలి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్ విషయం తేల్చాలని విష్ణువర్ధన్‌రెడ్డి వర్గీయులు పట్టుబట్టారు. అదే సమయంలో విష్ణుకు పార్టీ బాధ్యతలు అప్పగించవద్దని, ఆయన వైయస్సార్ కాంగ్రెస్‌లోకి వెళ్లి సోనియా గాంధీ ఫోటోను కాళ్లతో తన్నారని, అలాంటి వ్యక్తికి నాయకత్వం అప్పగిస్తే పార్టీ మునుగుతుందని విష్ణు వ్యతిరేకవర్గీయులు నినదించారు. ఈ సమయంలో ఆనం రామనారాయణరెడ్డి జోక్యం చేసుకుని... ఇన్‌ఛార్జ్ నియామకం గురించి అధిష్టానం చూసుకుంటుందని, అది తన వద్ద తేలే విషయం కాదన్నారు. అయినా విష్ణు వర్గీయులు అదేపనిగా గోల చేస్తుండడంతో మంత్రికి మోకాల్లో మండి... అసలు ఎవరు మీరు... కాంగ్రెసోళ్లేనా... మీరు అంత మొగాళ్లయితే గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఎందుకు గెలిపించుకోలేక పోయారంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు.

మళ్లీ వేదికపైకి నాయకులను పిలిచే విషయంలోనూ గొడవ రేగింది. విష్ణుకు వ్యతిరేకులైన తాళ్లూరి రమణయ్యనాయుడు, మేడా అశోక్‌కుమార్‌రెడ్డి, కడగుంట్ల మధుబాబునాయుడులను వేదికమీదకు పిలవవద్దని విష్ణు వర్గీయులు డిమాండ్ చేసారు. కాని మంత్రి మైకు లాక్కుని ఇది మంచి సంప్రదాయం కాదని, వేదికమీదకు ఇంకా ఎవరినైనా పిలవాల్సివుంటే చెప్పాలని గుర్తుచేసారు. సమావేశానికి అధ్యక్షత వహించిన విష్ణువర్ధనరెడ్డి మాత్రం తన వ్యతిరేకులైన మధుబాబు, అశోక్‌కుమార్ రెడ్డి, రమణయ్యనాయుడులకు మాట్లాడే అవకాశమివ్వకపోవడంతో వారంతా మంత్రివద్ద తమ ఆవేదన వ్యక్తం చేసారు.


కావలిలో కాంగ్రెస్‌పార్టీ అంతంత మాత్రంగా వుంది. దీనికి గ్రూపు గొడవలు తోడైతే మరింత నీరసపడే అవకాశాలున్నాయి.

PDF Compressor Free Version



ఇదీ నా కథ - 49
(1924 - 2011)

# వెలుగునీడలు నిర్మాణం




'వెలుగు నీడలు' చిత్రానికి మూలం ఒక గుజరాతీ చిత్రం. ఆ చిత్రం అక్కడ అఖండ విజయం సాధించింది. ఆ సంగతి తెలుసుకొని నేను గుజరాత్ వెళ్ళి పిక్చర్ రీమేక్ హక్కులు కొని అగ్రిమెంట్ చేసుకొని హైదరాబాద్ వచ్చాను. తెలుగులో 'వెలుగు నీడలు' అని పేరు పెట్టాను. అది కుటుంబ కథా చిత్రం తారాగణం మీనా, వెంకట్, మహేశ్వరి, సురేష్, పృథ్వి, జయప్రద మొదలైనవారు, అందులో నేను మీనాకు తాతగా నటించాను. సంగీతం ఎం.ఎం శ్రీలేఖ, దర్శకుడు మౌర్య, పర్యవేక్షణ పి.సి.రెడ్డి, సంభాషణలు గణేష్‌పాత్రో. పాటలన్నీ నేనే రాశాను.

ఎక్కడా రాజీ అన్నది లేకుండా వ్యయప్రయాసలను లెక్క చేయకుండా చిత్ర నిర్మాణం పూర్తి చేశాను. పాటలు సూపర్ హిట్టయ్యాయి. 'వెలుగు నీడలు' గుజరాత్‌లో లాగా ఘన విజయం సాధిస్తుందన్న ఆశతో 1999లో విడుదల చేశాను. కాని నా ఆశ పగటికలగానే మిగిలిపోయింది. అదే సంవత్సరం నా చిన్నతమ్ముడు సుబ్బరామిరెడ్డి మరణించాడు. తర్వాత మూడేళ్ళకు నా పెద్దతమ్ముడు రామచంద్రారెడ్డి కూడా చనిపోయాడు. అన్నగా నేను జీవించి ఉండగానే ఇద్దరు తమ్ముళ్ల మరణించడం బాధాకరమైన పరిణామం.

## వంశోద్ధారకుడు నిర్మాణం

తర్వాత కళాబంధు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డిగారు ఒకరోజు నన్ను ఇంటికి పిల్చి బాలకృష్ణతో మాట్లాడి కాల్‌షీట్లిప్పిస్తాను. అవసరమైన పెట్టుబడి కూడా నేనే ఇస్తాను. గాయత్రీ ఫిలిమ్స్ తరపున చిత్రం జాయింట్‌గా నిర్మిద్దామని బాధ్యతంతా నాకు అప్పగించారు.

బాలకృష్ణ శరత్‌ను డైరెక్టర్‌గా పెట్టమని సూచించాడు. శరత్ అంతకు ముందు బాలకృష్ణతో రెండు విజయవంతమైన పిక్చర్లు డైరెక్టు చేసి వున్నాడు. చిత్రానికి 'వంశోద్ధారకుడు' అని పేరు పెట్టాం. అందులో బాలకృష్ణ, కృష్ణంరాజు, రమ్యకృష్ణ సాక్షి శివానంద్, రాధిక, చరణ్‌రాజు, బ్రహ్మానందం మొదలైనవారు ముఖ్య తారాగణం. సంగీతం కోటి, ఛాయాగ్రాహకుడు వి.యస్.ఆర్.స్వామి. ఎడిటర్ కృష్ణారెడ్డి అందులో వేటూరి మూడు పాటలు, భువనచంద్ర, రెండుపాటలు రాశారు. ఖజురహోలో చిత్రించిన పాట మాత్రం నేను రాశాను. దాంతో చిత్రం షూటింగ్ పూర్తయింది. భారీ తారాగణంతో నిర్మించడం వలన కొనుగోలు దారులు ఆ చిత్రంపై అనూహ్యమైన ఆశలు పెంచుకున్నారు.

బాలకృష్ణ వద్ద 'సత్యనారాయణ చౌదరి' అని ఒక అజ్ఞాన జ్యోతిష్యుడు ఆస్థాన విద్వాంసుడుగా వున్నాడు. అతనేది చెప్తే అది బాలకృష్ణకు వేదం. సత్యనారాయణ చౌదరి 'వంశోద్ధారకుడు' సంక్రాంతికి విడుదల చేస్తే అఖండవిజయం సాధిస్తుందని చెప్పడంతో బాలకృష్ణ పిక్చర్ సంక్రాంతికి విడుదల చేసి తీరాలని పట్టుబట్టాడు.

ఇక తప్పదని ఎడిటింగ్, డబ్బింగ్ మొదలైన కార్యక్రమాలు హడావుడిగా పూర్తి చేసి మొదటి కాపీ కూడా చూడకుండానే సుబ్బరామిరెడ్డిగారి అనుమతితో పెట్టుబడికి ఢోకా లేకుండా అన్ని ఏరియాలు ముందుగానే అమ్మేసి 2000 సంవత్సరం సంక్రాంతి రోజున విడుదల చేశాను. చిత్రం అంతంత మాత్రంగానే ఆడింది. కొనుగోలుదార్లు బాగా నష్టపోయారు. నా ఆర్థిక బాధవలన సుబ్బరామిరెడ్డిగారి పెట్టుబడి తిరిగి ఇవ్వలేకపోయాను. అయినా వారు ఈ రోజు వరకు నా పెట్టుబడి మాటేమిటని ఒక్కసారి కూడా నన్నడగలేదు. అది వారి ఔదార్యానికి నామీదగల అభిమానానికి నిదర్శనం.

తర్వాత సుబ్బరామిరెడ్డిగారి సమర్పణలో 'అందం' చిత్రం ప్రారంభించాను. హీరో. హీరోయిన్లిద్దరూ కొత్త వాళ్ళు హీరో పేరు కౌశిక్, హీరోయిన్ పేరు సహన. దర్శకుడు శ్రీనివాస్‌రెడ్డి, సంగీతం ఘంటాడి కృష్ణ, మిగతా టెక్నీషియన్లందరూ సుప్రసిద్ధులు.

హీరో హీరోయిన్లిద్దరూ అందంగా ఉంటారు. కాని నటనలో ఇద్దరూ జీరోలే. ఫలితంగా ఆ చిత్రం విడుదల కాకుండానే ఇప్పటికీ మూలపడి ఉంది. నా సినీ జీవితంలో ఒక చిత్రం విడుదలకు నోచుకోక పోవడం నన్ను నిలువునా క్రుంగదీసింది. కాని తర్వాత శ్రీనివాసరెడ్డి దర్శకత్వం వహించిన కొన్ని పిక్చర్లు మంచి విజయం సాధించాయి. కొనుగోలుదార్లలో అతని మాటకు విలువ పెరిగింది. అతనేదైనా మాట సాయం చేసి 'అందం' చిత్రాన్ని బైటపడేస్తాడన్న ఆశతో ఏడెనిమిది సార్లు ఫోన్ చేశాను. కానీ అతను నాతో ఫోన్లో మాట్లాడేందుకు కూడా ఇష్టపడలేదు. అతని తలపొగరుకు ఇదొక తార్కాణం, నాకు మరొక అనుభవం.

> పరిశ్రమకు వచ్చాక కష్టాలు నష్టాలు నన్ను కొరివి దెయ్యాల్లా వెంటాడాయి. నా ఆస్తులన్నీ హరించుకుపోయాయి. కారణం లాభనష్టాలకు అతీతంగా ఆర్టిస్టులకు, సాంకేతిక నిపుణులకు పైసా తగ్గించకుండా పారితోషికాలు చెల్లించడం కోసం శక్తికి మించి అప్పులు చేశాను.

నేను సినిమా పరిశ్రమకు వెళ్లినందువలన మహాకవి శ్రీశ్రీ, దేవులపల్లి, సముద్రాల, పింగళి, ఆరుద్ర, ఆత్రేయ, దాశరథి, సినారె, మొదలైన సుప్రసిద్ధ రచయితలతో పరిచయం పెంచుకున్నాను.

బి.యన్.రెడ్డి, నాగిరెడ్డి, చక్రపాణి, కె.వి.రెడ్డి, ఎల్.వి.ప్రసాద్, కె.యస్.ప్రకాశ్‌రావు మొదలైన దర్శక నిర్మాతల నుండి 'చలనచిత్ర నిర్మాణానికి అవసరమైన అనేక అంశాలు అవగాహన చేసుకున్నాను. సాహిత్యానికి సంగీతం ఎంత దోహదపడుతుందో తెలుసుకున్నాను. వ్యక్తిగా దర్శకుడుగా కమలాకర కామేశ్వరరావు నుండి నాకు తెలియని విషయాలు ఎన్నో తెలుసుకున్నాను. ఆర్ట్ డైరెక్టర్ గోఖలే పరిచయం మూలంగా ఆత్మగౌరవానికి అర్థం తెలుసుకున్నాను. రామాయణం చిత్రానికి జాతీయ అవార్డును అందుకున్నాను. ఇవన్నీ నేను పోగుచేసుకున్న అంశాలు.

ఇక పోగొట్టుకున్నదంటారా! చాలా పోగొట్టుకున్నాను. కొన్ని సందర్భాలలో ఆత్మను చంపుకున్నాను. 'కృతజ్ఞత' అనే పదం సినిమా నిఘంటువులో కాగడా పట్టి వెదకినా కనిపించదన్న నిజం తెలుసుకున్నాను. వ్యక్తిత్వాన్ని కాపాడుకోలేక పోయాను. కొన్ని చీకటి తప్పులు చేశాను. సినిమా పరిశ్రమకు రాక ముందు నేను ఏ వ్యాపారంలోనూ ఒక్క రూపాయి నష్టపోలేదు. పరిశ్రమకు వచ్చాక కష్టాలు నష్టాలు నన్ను కొరివి దెయ్యాల్లా వెంటాడాయి. నా ఆస్తులన్నీ హరించుకుపోయాయి. కారణం లాభనష్టాలకు అతీతంగా ఆర్టిస్టులకు, సాంకేతిక నిపుణులకు పైసా తగ్గించకుండా పారితోషికాలు చెల్లించడం కోసం శక్తికి మించి అప్పులు చేశాను. ఋణదాతలకు క్రమం తప్పకుండా నెలనెలా వడ్డీలు చెల్లించాను. ఆ వడ్డీలే నా కొంప ముంచాయి. ఇప్పటికీ నా ఋణదాతల్లో కొంత మంది బ్రతికి చెడ్డవాడినన్న ఉద్దేశ్యంతో తమ బాకీలు అడగడం మానుకున్నారు. అలాంటి వారిలో కళాబంధు టి.సుబ్బరామిరెడ్డిగారు, డాక్టర్ ఉండేల మాలకొండారెడ్డిగారు, జివికె. రెడ్డిగారు, వై.యస్.చౌదరిగారు, ప్రసాద్ ల్యాబ్ రమేష్‌గారు ముఖ్యులు.

ఇక నా కథ ప్రక్కన పెట్టి మా అబ్బాయి శ్యామ్ నిర్మించిన చిత్రాల గురించి వివరిస్తాను.

## తలంబ్రాలు చిత్ర నిర్మాణం

అది 1986వ సంవత్సరం. ఒకరోజు నేను మా అబ్బాయితో నువ్వు బిజినెస్ మేనేజ్‌మెంటు కోర్సు చదివావు. ఏ వ్యాపారాన్నయినా సమర్థవంతంగా నిర్వహించగలవన్న నమ్మకం నాకుంది. సినిమా వ్యాపారం ఎప్పుడెవర్ని ముంచుతుందో చెప్పలేం. కాబట్టి నువ్వేదైనా ఇండ్రస్టీ ప్రారంభించే ప్రయత్నం చెయ్యి మీ మామగారి సహాయం కూడా నీకుంటుంది అని చెప్పాను.

అందుకు సమాధానంగా వాడు లాభనష్టాలనేవి ప్రతి వ్యాపారంలో వుండేవే నాన్నా! ప్రేక్షకులకు సరైన వినోదాన్నందించగలిగితే ఎంత డబ్బయినా ఇస్తారు. అలాగే భోజన ప్రియులకు రుచికరమైన ఆహారం పెడితే ఖర్చుకు వెనకాడరన్నాడు. వాడి మాటల్లో కొంత వాస్తవముందని నాకనిపించింది. వెంటనే శ్యామ్‌ను అపారమైన వ్యాపారానుభవంగల రామోజీరావు గారి వద్దకు తీసుకొని వెళ్ళి వారి సలహా అడిగాను.

రెడ్డిగారూ! శ్యామ్ మరీ చిన్న పిల్లవాడేం కాదు. బాగా చదువుకున్న వాడు. అతనికిష్టమైన మార్గంలోనే పోనివ్వండని సలహా ఇచ్చారాయన. ఐతే వాడి మొదటి సినిమాకు కొంత అడ్వాన్స్ మీరిచ్చి మీ సంస్థ ద్వారానే విడుదల చేసి పెట్టండని నేను కోరాను.

అందుకాయన అంగీకరించి పన్నెండు లక్షల రూపాయలు అడ్వాన్స్‌గా ఇస్తాను. ఆరు నెలల్లోగా మా అడ్వాన్స్, ప్రింట్లు, పబ్లిసిటీ ఖర్చు, కమీషన్‌తో సహా రాకపోతే బ్యాలెన్స్ మొత్తం తిరిగి 'మీరు' చెల్లించాలని షరతు పెట్టారు. నేనలాగే అన్నాను. వెంటనే రామోజీరావుగారు మేనేజరు కేశవరావుకు వివరాలన్నీ చెప్పి అగ్రిమెంటు తయారుచేయించి పన్నెండు లక్షల రూపాయలు అడ్వాన్స్‌గా మయూరి ఫిల్మ్స్ ద్వారా శ్యామ్‌కిచ్చే ఏర్పాటు చేయమన్నారు.

(ఇంకా వుంది)

ఉత్తరక్రియలు



మాకు మార్గదర్శకులు, మా అభివృద్ధికి కారకులు
మా ఇంటి దీపం, మా పెద్దదిక్కు

కోర్శపాటి గోపాలరెడ్డి గారు

తే. 06.05.2012ది ఆదివారం పరమపదించారు.

వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

కుమార్తెలు - అల్లుళ్లు
యం.హైమావతమ్మ - యం.షణ్ముగంరెడ్డి
ఐ. శ్యామలమ్మ - ఐ.జనార్ధన్‌రెడ్డి
సి.జ్ఞానప్రసూనమ్మ - సి.కృష్ణారెడ్డి

మనుమరాళ్లు:
యం.సాహితి
సి.అనూష
సి.అమృష

భార్య - సీతమ్మ

కుమారుడు - కోడలు
కె.శ్రీధర్‌రెడ్డి - కె.శైలజ

మనుమళ్లు:
ఐ.పవన్‌రూపేష్‌కుమార్‌రెడ్డి
యం.సిద్ధార్థ్‌రెడ్డి
కె.సన్నిహిత్‌రెడ్డి
కె.శివహిత్‌రెడ్డి

ఉత్తరక్రియలు: తే. 16.05.2012ది బుధవారం ఉదయం 9గంటలకు పాతబిట్రగుంటలోని వారి స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.



## మన సుబ్బరామన్న...

# కళాభిరాముడే కాదు... సేవాభిరాముడు కూడా!

### --- కళాపరిషత్ ఆవిష్కరణ సభలో నేతల కితాబు ---

టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ నెల్లూరు శాఖను మే 6వ తేదీ సాయంత్రం "పద్మవిభూషణ్" డా॥ అక్కినేని నాగేశ్వరరావు అమృత హస్తాల మీదుగా ప్రారంభించారు. కళాబంధు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, "నటవాచస్పతి" బిరుదాంకితుడు డా॥ మోహన్‌బాబులతో పాటు పలువురు సినీప్రముఖులు తోడునిలువగా పార్లమెంటు సభ్యులు లగడపాటి రాజగోపాల్, జె.డి.శీలం, మాగుంట శ్రీనివాసులురెడ్డి, జి.వి.హర్షకుమార్, చింతా మోహన్, రాష్ట్ర ఆర్థికశాఖమాత్యులు ఆనం రామనారాయణరెడ్డి, శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, మాజీమేయర్ నందిమండలం భానుశ్రీ, మాజీ కార్పొరేటర్లు పిండి సురేష్, చాట్ల నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు పనబాక కృష్ణయ్య, చెంచలబాబు యాదవ్, సిహెచ్ హరిబాబుయాదవ్, లలిత కళాపరిషత్ నెల్లూరు శాఖ అధ్యక్షులు జె.వి.రెడ్డి, సంస్థ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దొడ్ల వరదారెడ్డి తదితర ప్రముఖుల సాక్షిగా రిమోట్ కంట్రోల్ ద్వారా టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్‌ను అక్కినేని నాగేశ్వరరావు ఆవిష్కరించారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డా॥ అక్కినేని నాగేశ్వరరావు, టి.సుబ్బరామిరెడ్డి, లగడపాటి రాజగోపాల్, మోహన్‌బాబు, లక్ష్మీప్రసన్న, వాణిశ్రీ, అర్చన, పరుచూరి, మురళీమోహన్, డా॥ రామానాయుడు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆనం వివేకానందరెడ్డి తదితరులు



టి.యస్.ఆర్‌తో సమాలోచనలు చేస్తున్న దొడ్ల వరదారెడ్డి



వేదికపై ఆశీనులైన జె.వి.రెడ్డి, కంభం, తనికెళ్ల



టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆవిష్కరణలో పాల్గొన్న రాజకీయ అతిరథమహారథులు

నేనూ నెల్లూరీయుడనే, కానీ విజయవాడ వాసిగా ప్రసిద్ధి చెందాను, నాలాగే ఇక్కడే పుట్టి పెరిగిన టి.యస్.ఆర్ విశాఖ నుండి నెల్లూరుకు రావడం శుభపరిణామం అంటూ తన అభినందనలను తెలియజేశాడు విజయవాడ పార్లమెంటు సభ్యుడు లగడపాటి రాజగోపాల్. నెల్లూరు ప్రజలకు అతితక్కువ కాలంలోనే సుబ్బరామన్న చేరువైపోతాడని అనేక సందర్భాలలో ఆయన నైజాన్ని అతిదగ్గరగా గమనించిన వ్యక్తిగా తానీ విషయాన్ని చెప్తున్నానని అన్నాడు. ఆయనను అజాతశత్రువు అంటే అతిశయోక్తి కాదన్నారు.

యం.యల్.సి. పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాలలో మొదటిస్థానంలో నిలవాలంటే అందరికీ సాధ్యంకాదని, సుబ్బరామిరెడ్డి ఏ రంగాన్ని ఎన్నుకున్నా అందులో తానే సంచలనంగా వుండాలని ప్రయత్నించడం గొప్ప విషయమన్నారు.

మరో యం.పి. హర్షకుమార్ తన మాటలలో తడ నుండి శ్రీకాకుళం వరకూ సుబ్బరామిరెడ్డి ప్రస్థానం ఎందరికో ఆదర్శమని, రాష్ట్రమంతా కళాసంస్థలు నెలకొల్పి కళామతల్లి సేవ ద్వారా ప్రజాసేవ చేయాలనే సంకల్పానికి నాంది పలికిన ఆయన పుణ్యజీవే కాదు, ధన్యజీవి అని కొనియాడారు.

ఇంకో పార్లమెంటు సభ్యుడు జె.డి. శీలం మాట్లాడుతూ చాలా అరుదైన మనస్తత్వం కలిగిన మంచి వ్యక్తని, ఈరోజు నెల్లూరుజిల్లా కళారంగం ద్వారా నెల్లూరు వాసులకు సేవలందించడానికి జిల్లాలో అరంగేట్రం చేస్తున్న టి.యస్.ఆర్.ని ఆదరించి అభిమానించి అక్కున చేర్చుకోవాలని సూచించారు.


ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి సుబ్బరామిరెడ్డి గుణగుణాలను వివరిస్తూ అతితక్కువ మందిలో కనిపించే స్వభావమని, ఆయన చేపట్టిన పని ఏదైనా ఏకాగ్రతతో లక్ష్యసాధనతో సాధించే గొప్ప పట్టుదల కలిగిన వ్యక్తని అన్నాడు. ఇన్నాళ్లు జిల్లాకి దూరంగా వున్నా ఆరు నెలల క్రితం ఇచ్చిన మాటకు కట్టుబడి ఈరోజు "లలిత కళాపరిషత్"ను నెల్లూరులో ప్రారంభించి నెల్లూరీయులతో తన అనుబంధాన్ని పెంచుకోవడానికి మనముందుకొచ్చాడని, అందరూ ఆదరించి ఆయన సేవల ద్వారా ఈ జిల్లాను పునీతం చేయాలని పిలుపునిచ్చాడు.

నెల్లూరు గ్రామీణ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి అక్కినేని అభినయాలు తనకు చాలా అబ్బాయని, సిగరెట్టు కాల్చడం దగ్గర నుండి అనేక విషయాలలో ఆయనను ఆదర్శంగా తీసుకుని అనుకరిస్తుంటానని చెప్పారు. ఇక సుబ్బరామన్న విషయానికొస్తే ఆయన స్టైలే వేరని, ఇంత మంది సినీ, రాజకీయ దిగ్గజాలను ఒక వేదికపై ఇన్ని గంటలు కూర్చోబెట్టాలంటే అది ఆయనకే సాధ్యమని చెప్పాడు. ఆయన నెల్లూరులో తన భావిజీవితాన్ని గడపాలనుకోవడం, నెల్లూరులో స్థిరనివాసం ఏర్పరుకొని నెల్లూరీయుల గుండెల్లో స్థానం పొందాలనుకోవడం నెల్లూరుజిల్లా వాసులు చేసుకున్న అదృష్టంగా అభివర్ణించారు.

అమెరికన్ హాస్పిటల్, దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యశాల, సి.ఏ.యం. హైస్కూలు మినహా జిల్లాలో పెద్దగా అభివృద్ధి జరగలేదని 50సంవత్సరాలుగా జిల్లా వెనుకబడిపోయిందని తిరుపతి యం.పి. చింతా మోహన్ అన్నారు. ఇప్పటికే మూతబడిపోయిన అమెరికన్ ఆసుపత్రి, నేడోరేపో మూతబడిపోనున్న సి.ఏ.యం హైస్కూళ్లను అభివృద్ధికి ఆనవాళ్లుగా ఆయన పేర్కొనడం, దుగరాజపట్నంలో రాబోయే పోర్టు గురించి మాట్లాడుతూ ఇప్పటికే అభివృద్ధి చెందిన కృష్ణపట్నం పోర్టును విస్మరించడం కార్యక్రమంలో వున్నవారిని ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఆయన ప్రసంగం దారి తప్పడమే కాకుండా కొంచెం అధికం కావడంతో సుబ్బరామిరెడ్డి కలుగచేసుకుని ఈ వేదికపై రాజకీయ ప్రసంగాలను చేయవద్దని సున్నితంగా మందలించారు.

మొత్తంమీద నిత్యం రాజకీయాలతో ఒకరిపై ఒకరు తిట్ల వర్షం కురిపించుకుంటూ ప్రసంగాలు సాగించే "పొలిటికల్" లీడర్లచేత కళలగురించి, కళారంగం గురించి మాట్లాడించిన ఘనత టి.యస్.ఆర్‌కి దక్కింది. రాజకీయ నాయకులంటే ఇంతకాలం ఒక కోణంలోనే చూసిన ప్రజలు, ఆయన రాకతో రెండో వైపు చూసారు.













అక్కినేనిని సత్కరిస్తున్న ఆనం వివేకానందరెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నందిమండలం భానుశ్రీ




మోహన్‌బాబు, మురళీమోహన్‌లను సన్మానిస్తున్న ఆనం వివేకానందరెడ్డి

Edited, Published, Printed & owned by THUNGA SIVAPRAB[illegible] REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NEL[illegible] Ph:2323 [illegible] Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY